ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -83 పేజీలు - 08 వెల - 04/- గురువారం 2 జనవరి 2025


# అమరావతిలో రూ.2,733 కోట్ల పనులకు పచ్చజెండా

ఎస్ఐపీబీ ఆమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు ఓకే

మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు అంగీకారం

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19పోస్టులు

తిరుపతిలో ఈఎస్ఐ ఆస్పత్రిని 100 పడకలకు పెంచాలని నిర్ణయం





వెలగపూడి ఆంధ్ర ప్రగతి:
అమరావతిలో రూ.2,733 కోట్లతో చేపట్టనున్న పనులతో పాటు సీఆర్డీఏ 44వ సమావేశం లో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది చంద్రబాబు కేబినెట్ . మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు అంగీకారం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన కేబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు.. మొత్తం 14 అంశాల పై ఏపీ కేబినెట్ చర్చించింది. రైతు సాయాన్ని రూ.20 వేలకు పెంచింది కేబినెట్. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న 10 వేలకు అదనంగా మరో పదివేల కలిపి ఇవ్వాలని మంత్రివర్గ నిర్ణయించింది. అలాగే మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఏక మొత్తంలో రూ.20 వేలు ఇచ్చేందుకు చంద్రబాబు మంత్రి వర్గం ఆమోదముద్ర వేసింది..మిగతాది 2లో...

# క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

నలుగురికి మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలు

డి.గుకేశ్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్, మను బాకర్‌ల ఎంపిక

అర్జున అవార్డుకు 32మంది, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురి ఎంపిక

అర్జున అవార్డుల్లో తెలుగమ్మాయిలు దీప్తి, యర్రాజీలకు చోటు






# కోటిమంది టిడిపి కార్యకర్తలకు బీమా

యునైటెడ్ ఇండియాతో టిడిపి ఒప్పందం




2లో

# ఏపీకి మోడీ వరాలు మోసుకొస్తున్నారా ?



2లో

# వైసీపీ పాపాల వల్ల భూ సమస్యలు

భూ సమస్యలపై 1.8 లక్షల అర్జీలు వచ్చాయి: మంత్రి అనగాని

13 వేల ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించామని వెల్లడి

రెవెన్యూ సదస్సులకు 6 లక్షల మంది హాజరయ్యారన్న మంత్రి



అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి:
గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల వల్ల రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. రెవెన్యూ సదస్సులకు వస్తున్న వినతులే దీనికి ఉదాహరణ అని చెప్పారు. భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 1.8 లక్షల అర్జీలు వచ్చాయని తెలిపారు. 13 వేల ఫిర్యాదులకు అక్కడికక్కడే పరిష్కారాలు చూపామని చెప్పారు. రెవెన్యూ సదస్సులకు ఇప్పటి వరకు 6 లక్షల మంది హాజరయ్యారని తెలిపారు. ఆర్వోఆర్ లో తప్పులపై లక్షకు పైగా ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు.

# బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేత

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై హైకోర్టు ఆగ్రహం



2లో

# పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి


విజయవాడలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన పవన్

పివిపై రాసిన పుస్తకావిష్కరణ చేసిన డిప్యూటి సిఎం



విజయవాడ,జనవరి2ఆంధ్ర ప్రగతి:
తనకు జీవితంలో నిలబడే ధైర్యాన్నిచ్చింది పుస్తకాలేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవ సంఘం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన 35వ పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రారంభించారు.మిగతాది 2లో...

# మనమంతా ఒక టీం.. కలిసి పనిచేద్దాం... ప్రజల జీవితాలు మారుద్దాం..!




4లో

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# మున్సిపల్ చట్ట సవరణకు ఆమోదం

(మొదటి పేజి తరువాయి)
పిఠాపురం ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ లో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఏపీ ఎంఆర్యూడీఏ చట్టం 2016లో భవనాల లేఅవుట్ల అనుమతులను మున్సిపాలిటీలకు అప్పగిస్తూ సవరణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో కొత్తగా 19 పోస్టుల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. తిరుపతి ఈఎస్ఐ ఆస్పత్రి పడకలను 100కి పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ, కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుపై కేబినెట్ మీటింగ్లో చర్చించారు. అలానే చిత్తూరు జిల్లాలో హోంశాఖ ఐఆర్ బెటాలియన్ ఏర్పాటుకు కేటాయించనున్న స్థలంపై క్యాబినెట్‌లో చర్చ జరగింది . నంద్యాల, వైఎస్ఆర్, కర్నూలు జిల్లాల్లో పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ అంగీకారం తెలిపింది.ఎస్ఐపిబి అమోదించిన రూ.1,82,162 కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ అమోదం తెలపింది. ఈ పెట్టుబడులు వలన 2,63,411 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముంది. నెల్లూరు జిల్లా రామయ్యపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ. 96,862 కోట్ల పెట్టుబడితో బీపీసీఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్. దీని వలన 2,400 మందికి ఉపాధి కలగనుంది. మొత్తం 9 మిలియన్ మెట్రిక్ టన్నులు సామర్థ్యంతో ఐదు బ్లాకుల్లో రానున్న ఈ ప్రాజెక్టులో టౌన్‌షిప్, లెర్నింగ్ సెంటర్, రిఫైనరీ, పెట్రోకెమికల్స్ యూనిట్స్, క్రూడ్ ఆయిల్ టెర్మినల్, గ్రీన్ హెచ్2, అడ్మినిస్ట్రేషన్ బ్లాకులు నిర్మించనున్నారు. విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌లో 2,08,280 చదరపు అడుగుల విస్తీర్ణంలో టీసీఎస్ రూ. 80 కోట్ల పెట్టుబడులకు అమోదం తెలిపింది. దీంతో 2 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా, గుడిపల్లిలో ఆజాద్ మొబిలిటీ ఇండియా లిమిటెడ్ సంస్థ ఎలక్ట్రిక్ త్రీ వీలర్ ట్రక్కులు, బస్సులు, బ్యాటరీ ప్యాక్‌ల కోసం ఈ సంస్థ రూ. 1,046 కోట్ల పెట్టుబడిలకు క్యాబినెట్ ఓకే చెప్పింది. దీని ద్వారా 2,381 మందికి ఉపాధి కలుగనుంది..అనకాపల్లి జిల్లా రాంబిల్లిలోని 106 ఎకరాల్లో బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.1,174 కోట్ల పెట్టుబడులకు , ది. రాష్ట్రంలో కొత్తగా ఐదు సంస్థలు క్లీన్ ఎనర్జీలో రూ. 83 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. వీటితోపాటు సీఎం చంద్రబాబు తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని పేర్కొన్న రాష్ట్రంలోని నదుల అనుసంధానం గోదావరి టూ బనకచర్ల ప్రాజెక్టుపై క్యాబినెట్‌లో చర్చించారు

# పుస్తక పఠనంతో నిలబడే ధైర్యం వచ్చింది

(మొదటి పేజి తరువాయి)
మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు సాహితీ వేత్తగా, రచయితగా మహోన్నతులు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకం ఆవిష్కరించడం ఆనందంగా ఉందని అన్నారు. పీవీ గురించి మాట్లాడే అంత జ్ఞానం తనకు లేదని చెప్పారు. తనకు అంత జ్ఞానం వచ్చాక మాట్లాడతానని అన్నారు. పీవీ తన గ్రంధాలయం తీసుకుని ఏపీకి వద్దామనుకున్న సమయంలో ప్రధాని అయ్యారని గుర్తుచేశారు. ఢిల్లీలో పీవీకి సరిగ్గా ఖనన కార్యక్రమం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పీవీకి నివాళి అర్పించడానికి ఢిల్లీలో సమాధి లేదన్నారు. లక్షల మంది ముందుకు వచ్చి ఢిల్లీలో స్మృతి వనం ఏర్పాటు చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వనవాసి, అక్షర సత్యామృతం, ఏది పాపం, నానీపాల్కే వూ ది పీపుల్ ఇలా ఎన్నో పుస్తకాలు తాను చదివిన వాటిలో ఉన్నాయని తెలిపారు. .ఇక నుంచి తన ట్విట్టర్‌లో అప్పుడప్పుడు పుస్తకాలపై పోస్ట్ పెడతానని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఓజి ఓజి అంటూ అభిమానుల నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఓజి అనే కన్నా శ్రీశ్రీ అంటే బాగుంటుందని పవన్ కల్యాణ్ చమత్కరించారు.శ్రీశ్రీ మహా ప్రస్థానం, విశ్వానాథ సత్యనారాయణ , ఇతర కవులు ఎన్నో వేదనలతో రచనలు చేశారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి కృష్ణారావు రాసిన పీవీ నరసింహారావు జీవిత చరిత్ర పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. మైండ్‌కు శిక్షణ ఇస్తాయని.. అందుకే స్టేడియంలో శారీరక ధారుఢ్య తరహాలో.. మెదడు ధారుఢ్యం కోసం స్టేడియం ఇవ్వాలని చెప్పానని అన్నారు.తనకు నిలబడే ధైర్యాన్ని పుస్తకాలు ఇచ్చాయని ఉద్ఘాటించారు. తనకు ఐదో తరగతి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకున్నా అని చెప్పారు. మా అమ్మ , నాన్న వల్ల పుస్తక పఠనం అలవాటు అయ్యిందని గుర్తుచేశారు. కోటి రూపాయలు ఇస్తా కానీ, ఒక మంచి పుస్తకం ఇవ్వాలంటే ఎక్కువ సార్లు ఆలోచిస్తానని అన్నారు.తన జీవితంలో పుస్తక పఠనం లేకుంటే తాను ఏమయ్యేవాడినో అనిపిస్తుంద న్నారు. తాను కోరుకున్న జీవితం పుస్తకాల్లో కనిపించిందని పవన్ కల్యాణ్ చెప్పారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోండి. మీ భవిష్యత్తు కు ఒక ధైర్యం ఇస్తుంది. యువత పుస్తకాలు కొనండి, చదవండి, చదివించండి. అధ్యాపకులకు అధికంగా జీతాలు ఉండాలి. సమాజాన్ని ప్రభావితం చేసే అధ్యాపకులకు గుర్తింపు ఉండాలి. చిరిగిన చొక్కా తొడుక్కోకానీ, ఒక మంచి పుస్తకం కొనుక్కో. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటుగా మార్చుకోండి. అభిమానులు అరవడం కాదు.. పుస్తకం చదవాలన్న నా పిలుపును ఆచరించాలి‘ అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.అమృతం కురిసిన రాత్రి పుస్తకం, నేను తొలిసారిగా కొన్నాను. కొత్త పుస్తకాల సువాసన .. మట్టి వాసన లాగా చాలా బాగుంటుంది. రాజకీయాల్లో ఇంత బలంగా నిలబడ్డానంటే పుస్తక పఠనం కారణం. కథల్లో ఉన్న భావాలు, కష్టం, నష్టంపై బాగా ఆలోచనలు చేసే వాడిని. విశ్వనాథ సత్యనారాయణ రచనలు ‘ఆహా ఓహో‘ నన్ను ఆలోచింప చేసింది. గుర్రం జాషువా ‘ఫిరదౌసి‘ నన్ను చాలా ఆకట్టుకుంది. ఎడ్వంచర్ అంటే ‘బంగారం చేయడం ఎలా‘ అనే పురుషోత్తం పుస్తకం చదివా. గోపీచంద్ రచనలు సమాజంలో మంచి చెడులు తెలుపుతాయి‘ అని పవన్ కల్యాణ్ తెలిపారు. విద్యార్థులు తెలుగు వ్యాకరణంపై దృష్టి పెట్టాలి. ఇంగ్లీషు నేర్చుకోండి, మాతృభాష ద్వారానే పట్టు సాధ్యం. ఇంగ్లీషు వల్లే అంతా జరిగిపోదు, ఉద్యోగాలు వచ్చేయవు. మనలో సృజనాత్మకత ఉండాలంటే మాతృభాషపై పట్టు ఉండాలని అన్నారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఒక ధిక్కార స్వరమని ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్ ఎ.కృష్ణారావు తెలిపారు. తెలుగునాట కొద్ది మందికే అలా ఉంటుందని అన్నారు. స్వాతంత్య సమరయోధుడుగా ఉన్న సీఎం, పీఎం ఎంతోకాలం తర్వాత పీవీకి దక్కిందని చెప్పుకొచ్చారు. అలాంటి ధీరత్వం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లోనే తాను చూశానని చెప్పారు. ఓడినా ...ప్రజలకోసం పవన్‌కల్యాణ్ ముందుకు నడిచారని గుర్తుచేశారు. ఇప్పుడు డిప్యూటీ సీఎంగాను ముందు వరుసలో ఉన్నారని తెలిపారు. ఓడినవారు పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. అలాంటి వారు చరిత్రలో నిలిచిపోతారని కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, 'ఈనాడు' సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక మహోత్సవం కొనసాగుతుందని వీబీఎఫ్ఎస్ కార్యదర్శి మనోహర్‌నాయుడు తెలిపారు. ఈ ఏడాది 270 స్టాళ్లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

# బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేత

## సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులపై హైకోర్టు ఆగ్రహం



అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. నిందితుడు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టడమే పనిగా పెట్టుకున్నారా అని వ్యాఖ్యానించింది. ఇలాంటి వారిని క్షమించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. పిటిషనర్‌కు పూర్వ నేర చరిత్ర ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అనుచిత పోస్టుల వ్యవహారంలో నమోదైన 2 కేసుల్లో ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలైందని చెప్పారు. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో బోరుగడ్డ అనిల్‌పై అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకోగా.. తాజాగా గురువారం హైకోర్టు కొట్టివేసింది. వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో బోరుగడ్డ అనిల్ అరాచకానికి హద్దే లేకుండా పోయింది. పోలీసులు సైతం అతనివైపు చూడాలంటేనే భయపడే పరిస్థితి కల్పించాడు. గుంటూరు నగరానికి చెందిన అనిల్.. కేంద్రమంత్రిగా పని చేసిన రాందాస్ అఠావలె అనుచరుడిగా చెప్పుకొంటూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అయ్యాడు. జగన్‌ను అన్నా అని సంబోధిస్తూ తానూ పులివెందులకు చెందినవాడినేనంటూ వైకాపాతో అంటకాగాడు. జగన్‌కు తొత్తుగా వ్యవహరిస్తూ ప్రతిపక్షాలు, ప్రతిపక్షనేతలపై సభ్యసమాజం తలదించుకునేలా సామాజిక మాధ్యమాలు, టీవీ డిబేట్‌లలో ఇష్టానుసారం దూషణలు చేశాడు. వైకాపా ఐదేళ్ల పాలనలో జగన్‌కు వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడినా వారిపై అసభ్యకర పదజాలంతో విరుచుకుపడేవాడు. జగన్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ప్రతిపక్షాలకు చెందిన మహిళల గురించి అసభ్యకరంగా మాట్లాడి దూషించేవాడు. అప్పట్లో జగన్ పేరు చెప్పి గుంటూరు నగరంలో దందాలు, దౌర్జన్యాలతో హల్‌చల్ చేశాడు. నాడు అధికార పార్టీ వైకాపా అండదండలు ఉండటంతో ఇష్టారాజ్యంగా చెలరేగిపోయాడు. జగన్ పేరు చెబుతుండటంతో పోలీసుల అతని వైపు కన్నెత్తి చూడలేదు.

# కోటిమంది టిడిపి కార్యకర్తలకు బీమా

## యునైటెడ్ ఇండియాతో టిడిపి ఒప్పందం

అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి: కోటి మంది తెదేపా కార్యకర్తల బీమాకు మంత్రి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈమేరకు యునైటెడ్ ఇండియా కంపెనీతో పార్టీ తరఫున ఎంవోయూ చేశారు. జనవరి 1 నుంచే ఇన్సూరెన్స్ కవర్ అయ్యేలా అగ్రిమెంట్‌ను రూపొందించారు. ఉండవల్లిలోని నివాసంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇందులో భాగంగా కార్యకర్తలకు ప్రమాద బీమా వర్తించనుంది. కోటి మంది కార్యకర్తల కోసం ఒకేసారి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం రాజకీయ పార్టీల చరిత్రలో ఇదే ప్రథమం. ఒప్పందం ప్రకారం జనవరి 1, 2025 నుంచి డిసెంబర్ 31, 2025 వరకు కోటి మంది కార్యకర్తల బీమా కోసం తొలివిడతలో రూ.42 కోట్లు పార్టీ చెల్లించింది. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. కార్యకర్తల సంక్షేమనిధి సారథిగా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.138 కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో కేసుల్లో ఇరుక్కున్న కేడర్ కోసం న్యాయ విభాగాన్ని ఏర్పాటు చేశారు. వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. మృతిచెందిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్‌తో పాటు కృష్ణా జిల్లా చల్లపల్లిలో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యనందిస్తున్నారు.

# డిప్యూటీ సీఎంను కలిసిన కొత్త సీఎస్ !





అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి:
రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిగా (చీఫ్ సెక్రటరీ) బాధ్యతలు స్వీకరించిన విజయానంద్ ఐఏఎస్.. సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయానంద్‌కు పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. వారి అనుభవం రాష్ట్రాభివృద్ధికి, సుపరిపాలన అందించేందుకు ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు.అదే విధంగా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ నిరబ్ ప్రసాద్ కుమార్ ఐఏఎస్.. ఈరోజు సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా నిబద్ధతతో అంకితభావంతో సేవలందించిన ఆయనను పవన్ కళ్యాణ్ అభినందించారు.

# మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన ఏపీ జేఏసీ యూనియన్ నాయకులు

అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి:
ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ జేఏసీ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సచివాలయం రెండో బ్లాక్ మొదటి ఫ్లోర్‌లోని మంత్రి ఛాంబర్‌లో జేఏసీ నాయకులు మంత్రిని కలిశారు. ఆయనకు



పుష్పగుచ్ఛం, నూతన సంవత్సర డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో ఏపీ జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్, పోలీసు అధికారులు, వీఆర్ఏ-వీఆర్వో యూనియన్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పంచాయతీరాజ్ ఎంప్లాయిస్ యూనియన్, ఔట్ సోర్సింగ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రితో వివిధ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు.

# ఏపీకి మోడీ వరాలు మోసుకొస్తున్నారా ?



అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి:
ఎట్టకేలకు కొత్త ఏడాది మొదట్లోనే ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు అయింది. ఈ నెల 8న నరేంద్ర మోడీ విశాఖలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. దేశానికి మూడవసారి వరసగా ప్రధాని అయిన తరువాత మోడీ తొలిసారిగా విశాఖకు వస్తున్నారు. అందులోనూ ఆయన విశాఖ టూర్ పెట్టుకున్నారు అంటే విశాఖకు సంబంధించిన కీలక అంశాల మీద ఆయన నుంచి క్లారిటీ వస్తుందా అని చర్చిస్తున్నారు. దాదాపుగా పదిహేను వందల రోజుల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ లో కార్మికులు ఉద్యోగులు నిరసనలు నిర్వహిస్తున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ పరం చేయవద్దు అని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. విశాఖ వస్తున్న మోడీ ఈ విషయం మీద కచ్చితమైన హామీ ఇవ్వాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు విశాఖ అభివృద్ధి గురించి కూడా మోడీ ప్రకటనలు చేయాలని కోరుతున్నారు. గత పదేళ్ళుగా పెండింగులో ఉన్న ఉత్తరాంధ్ర కు సంబంధించిన విభజన హామీల మీద కూడా మోడీ స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని కోరుతున్నారు. అయితే మోడీ విశాఖ షెడ్యూల్ ఈ విధంగా ఉంది. ఆయన ఎనిమిదవ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు విశాఖలో అడుగుపెడతారు. దాదాపుగా నాలుగు గంటల పాటు ఆయన విశాఖలో గడుపుతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో ఆయన మాట్లాడిన తరువాత ఏయూ వేదికగా జరిగే బహిరంగ సభ నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మోడీ ఏపీకి సంబంధించిన అనేక కార్యక్రమలా గురినిచ్ మాట్లాడుతారని అంటున్నారు. అలాగే విశాఖకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు వర్చువల్ విధానం ద్వారా మోడీ ప్రారంభిస్తారు అని అంటున్నారు. మోడీ పర్యటనలో విశాఖ వేదిక నుంచి ఏపీకి సంబంధించిన కీలక ప్రకటనలు చేస్తారు అని అంటున్నారు. ఏపీ ప్రభుత్వం అమరావతి పోలవరం ఈ రెండూ ప్రాధాన్యతలుగా పెట్టుకుంది. దాంతో వీటి మీద మోడీ మరిన్ని వరాలు ఇస్తూనే అనేక ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా స్పష్టత ఇవ్వనున్నారు అని అంటున్నారు. ఏపీలో పలు జాతీయ రహదారులను ఇప్పటికే కేంద్రం మంజూరు చేసింది వీటితో పాటుగా మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు అని అంటున్నారు. చంద్రబాబు ఇటీవల ఢిల్లీకి వెళ్ళి ప్రధాని నరేంద్ర మోడీని కలసి అరగంటకు పైగా చర్చించారు. దాంతో పాటు ఏపీకి దండీగా నిధులను ఆయన కోరారు. వీటి మీద మోడీ విశాఖ సభ నుంచి ఏ ఏ వరాలు ఇస్తారు అన్న ఉత్కంఠ అయితే ఉంది. అన్నింటికీ మించి విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మోడీ ఏమి చెబుతారు అన్నది సర్వత్రా ఆసక్తిగా ఉంది విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో మోడీ మాట్లాడకపోతే మాత్రం ఇక ఉక్కు విషయంలో ప్రైవేట్ తథ్యమని నిర్ణయానికి రావచ్చు అని అంటున్నారు. ఎందుకంటే ఇప్పటికి నాలుగేళ్ళుగా ప్రైవేట్ బాటన ఉక్కు నెమ్మదిగా కదులుతోంది. ప్రధాని ఈ విషయంలో మాట్లాడకపోవడం కూడా మరో అర్థంగా భావించుకోవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి మోడీ ఉక్కు కర్మాగారం మీద ఏ రకంగా రెస్పాండ్ అవుతారో.

## కర్నూలు రేంజ్ డిఐజి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన నంద్యాల జిల్లా ఎస్పీ




ఆంధ్ర ప్రగతి కర్నూలు జనవరి 02:2025 నూతన సంవత్సరం సందర్భంగా కర్నూలు రేంజ్ డిఐజి శ్రీ డాక్టర్ కోయ ప్రవీణ్ ని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గురువారం కర్నూలు రేంజ్ డిఐజి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ యుగంధర్ బాబు ఉన్నారు.

## కేజీబీవీ ప్రిన్సిపల్ మృతి




ఆంధ్ర ప్రగతి పాణ్యం జనవరి 02:
పాణ్యం మండలం కేజీబీవీ స్కూలులో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ లలిత కుమారి ఒకటో తేదీ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధాకరం. గురువారం పాణ్యం నియోజకవర్గ గడివేముల మండలం చిందుకూరు వారి స్వగ్రామంలో ఆమె భౌతికాయానికి పూలమాలతో నివాళులు అర్పించిన విద్యార్థి యువజన ప్రజా సంఘాల నాయకులుపెరుగు శివకృష్ణ యాదవ్,వనం వెంకటాద్రి, బత్తిని ప్రతాప్ మరియు కేజీబీవీ స్కూల్ సిబ్బంది. వారి కుటుంబానికి మా ప్రగాడ సానుభూతి తెలిపారు.

## ఉపాధ్యాయ యూనియన్ నేతకు సన్మానం

### - మాజి ఉప సర్పంచ్ బ్రదర్ లక్క అనిల్ కుమార్.

ఆంధ్ర ప్రగతి సిరివెళ్ల జనవరి 02:
శిరివెళ్ల మండల పరిధిలోని గోవింద పల్లె గ్రామంలో ఉన్నటువంటి సీనియర్ ఉపాధ్యాయులు మరియు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఉపాధ్యాయ సంక్షేమ యూనియన్ నేత గడ్డం చెన్నయ్య గారిని కామినేని పల్లె గ్రామపంచాయతీ మాజీ ఉపసర్పంచ్ బ్రదర్ లక్క అనిల్ కుమార్, నీటి సంఘం ఉపాధ్యక్షులు లక్క ఆనందరావు, బుంగ శేఖర్, భూపతి రాజు, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు.నూతన సంవత్సర వేడుకలలో భాగంగా చెన్నయ్య సార్ ను సన్మానించి న్యూ ఇయర్ విషెస్ తెలిపినట్లు అనిల్ కుమార్ తెలిపారు. 2025 నూతన సంవత్సరములో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం వారి హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేయాలని ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. అనంతరం నూతన సంవత్సర వేడుకలలో భాగంగా కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టినట్లు తెలిపారు.

## కానాల గ్రామంలో గ్రామ సభ నిర్వహణ.




ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జనవరి 2: నంద్యాల మండలంలోని కానాల గ్రామం నందు పంచాయతీ సెక్రటరి మరియు పంచాయితీ ప్రెసిడెంట్ డి.బావమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సభయందు గ్రామ ప్రజలు పాల్గొని ముఖాముఖి తో మాట్లాడి ముఖ్యమైన సమస్యలు తెలపడం జరిగింది. అందులో భాగంగా ఎస్ డి పి ఐ కానాల గ్రామపంచాయతీ సెక్రటరీ పిట్టల.అంశర్ మరియు కార్యకర్తలు పాల్గొని అధికారులకు తెలియడం జరిగింది. గ్రామంలోని 8వ వార్డులో ఉన్న గొల్లకొట్ట అనే ప్రాంతంలో సిమెంట్ రోడ్డు వేయాలని ఆ సభలో తెలపడం జరిగింది.విద్యుత్ స్తంభాలు గురించి,గ్రామంలో ఎవరైతే గ్రామ పంచాయతీ సంబంధించి ఆస్తులు కబ్జాలు చేశారో అటువంటి వారిపై చర్యలు తీసుకోని,పంచాయతీ సంబంధించిన ఆస్తులు ప్రభుత్వ అధికారుల ఆదినంలోనే ఉండాలని,ఊరి బయట ఉన్న ప్రభుత్వ ఇచ్చిన స్థలాలలో లేఅవుట్ 3 లో వస్త్రా,మరియు అభివృద్ధి చేసి ఇవ్వాలని,ఊరిలో ఉన్న ప్రధాన నీటి కాలువల సమస్యలు,ప్రభుత్వ హాస్పిటల్ పనులు త్వరగా పూర్తి చేయాలని,ఇవే కాకుండా ఇంకా ప్రధానమైన సమస్యలు డిపార్ట్మెంట్ వైస్ ఈ గ్రామసభ వేదికపై పంచాయతీ అధికారు లకు మరియు ఉన్నత అధికారులకు వారి ముందర తెలపడం జరిగింది.ఈ సభలో ఎస్ డి పి ఐ మరియు టీడీపి లీదర్లు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ తప్పనిసరి

### -ఎస్ ఐ ఎన్. రామ్మోహన్ రెడ్డి.



ఆంధ్ర ప్రగతి
మహానంది జనవరి 02:
సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మహానంది ఎస్ఐ ఎన్ .రామ్మోహన్ రెడ్డి తెలిపారు.గురువారం మహానంది మండలం గాజులపల్లి గ్రామ పరిధిలోని బోయలకుంట్ల మెట్ట ఆర్చి వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీలలో వాహనాలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్లు లేని 20 మందికి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించి, వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్సులు కలిగి ఉండాలని, లేని యెడల జరిమానాలు విధిస్తామని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడప రాదని, త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే మైనర్లు వాహనాలు నడిపితే, వారి మీద చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీల్లో మహానంది పోలీస్ సిబ్బంది శేఖర్, సలాం , నారాయణస్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# మేరీనా బీచ్ లో గల్లంతు అయిన సాయి సంతోష్ రెడ్డి మృతదేహాన్ని గుర్తించి, అప్పగించండి

### -తమిళనాడు ముఖ్యమంత్రికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లేఖ



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జనవరి 02:
తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని మేరీనా బీచ్ లో గల్లంతు అయిన సాయి సంతోష్ రెడ్డి మృత దేహాన్ని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించే చర్యలు వేగవంతం చేసి సహాయం చేయాలని కోరుతూ గురువారం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఉత్తరం వ్రాచారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బరువెక్కిన హృదయంతో, ప్రగాఢమైన వేదనతో, ఒక కుటుంబాన్ని ఊహకందని బాధను మిగిల్చిన సంఘటన గురించి మీకు వ్రాస్తున్నాను సార్, సాయి సంతోష్ రెడ్డి, బి ఈ మొదటి సంవత్సరం చదువుతున్న 18 ఏళ్ల విద్యార్థి. సవిత యూనివర్శిటీలో చదువుకున్నారు. నూతన సంవత్సర 2025 జనవరి 1న స్నేహితులతో కలిసి సముద్రం లొకేషన్‌ను సందర్శిస్తుండగా మెరీనా బీచ్ నీటిలో విషాదకరంగా మునిగిపోయారు.
మృతదేహాన్ని గుర్తించేందుకు సిటీ పోలీసులు (డి6 అన్నా స్క్వేర్ పోలీస్ స్టేషన్) ఎడతెగని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. పోలీసులు తమ సామర్థ్యాల మేరకు వెళ్లారు, నేవీ మరియు కోస్ట్ గార్డ్ కూడా పాల్గొన్నారు. అయినప్పటికీ, మృత దేహం కనుగొనలేదు వారి కుటుంబ శోకం భరించలేనిదగా ఉంది.
సాయి సంతోష్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లాలోని నందివర్గం గ్రామానికి చెందినవారు, ఇది నా నియోజకవర్గం. అతని తల్లిదండ్రులు నా నియోజకవర్గం సభ్యులు, నేను వారిని ఎంతో గౌరవిస్తాను. వారి ఊహాతీతమైన నష్టం, వారి కుమారుడి విషాద మరణం భరించలేనిది. వారి కుటుంబాన్ని మాత్రమే కాకుండా మొత్తం సమాజాన్ని తీవ్రంగా కదిలించింది.
ఈ విషయంలో, మృతదేహాన్ని వెలికితీసేందుకు తక్షణమే ముమ్మరంగా చర్యలు తీసుకునేలా పోలీసులు, నేవీని ఆదేశించాలని మీ దయతో నేను హృదయపూర్వకంగా అభ్యర్థిస్తున్నాను అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. రెండు రోజులు కావస్తుంది ఇంకా మృతదేహాన్ని కనుగొనలేదు, వెంటనే మృతదేహాన్ని గుర్తించి తక్షణమే అతని తల్లిదండ్రులకు అప్పగించాలని మిమ్మల్ని కోరుతున్నాం అని ఆమె లేఖ ద్వారా కోరారు.

# భూకబ్జా దారులను కట్టడి చేయడంలో విఫలం



ఆంధ్ర ప్రగతి నంద్యాల జనవరి 02:
వైయస్సార్ నగర్ లో నందమూరి నగర్ లో భూకబ్జా దారులను కట్టడి చేయడం లో ప్రభుత్వ పెద్దలు. మున్సిపల్ అధికారులు. విఫలం అయినారని సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ ఒక సమావేశంలో అన్నారు.అనంతరం మాట్లాడుతూ.. నంద్యాల పట్టణ శివారు ప్రాంతాలైన నందమూరి నగర్ వైయస్సార్ నగర్ లో ఉన్న ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్న ప్రభుత్వ పెద్దలు గాని మున్సిపల్ కమిషనర్ కానీ ఏ మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు.
నందమూరి నగర్ వైయస్సార్ నగర్ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్న ఇప్పటికీ అక్కడ ఖాళీ స్థలాలు ఉన్నవి ఆ స్థలాలను కంప చెట్ల తో అడవిని తలపించే విధంగా ఉన్నవి ఆ స్థలాల కోసం కబ్జాకోర్లు పోటీపడి ఒక ప్లాట్ మీద రెండు లేదా మూడు పట్టాలు పుట్టిస్తూ దౌర్జన్యాలకు పూనుకుంటున్నారు. గతంలో స్వర్గీయ భూమా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నందమూరి నగర్ లో పేదల కోసం ఇచ్చిన ఇంటి స్థలాలను ఎందుకు ఖాళీగా ఉన్నవి అని పరిశీలన చేసి కొన్ని ప్లాట్లను గుర్తించి పేదలకు ఇవ్వడం జరిగింది.
ఇప్పుడు వైయస్సార్ నగర్ లో ఎల్ పి నెంబరు. 3 . 4. మరియు ఎల్ పి నెంబర్. 2. బ్లాక్ ఎల్ పి నెంబర్ 1. ఎల్ పి నెంబర్ 5 ట్రైలర్ కాలనీ ఇలా అన్ని ఏరియాలలో ప్లాట్లు కబ్జాలకు గురి అవుతున్నవి, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు మున్సిపల్ అధికారులు ఎందుకు ఇంతవరకు కాళీ స్థలాలు ఉన్నవి అని పరిశీలన చేసి ఆ ఖాళీ స్థలాలకు ఎవరు యజమానులుగా లేరు అని తెలిసిన యెడల పట్టణంలో అనేకమంది ఇల్లు లేని నిరుపేదలు ఉన్నారు వారికి ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీగా తెలియజేస్తున్నాం.ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ సిపిఐ శాఖ కార్యదర్శి భాష మబ్బులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో ఇంటెలిజెన్స్అధికారుల మెరుపు దాడులు



ఆంధ్ర ప్రగతి శ్రీశైలం జనవరి 02:
శ్రీశైలంలో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు మెరుపు దాడులు చేశారు. సముద్ర గర్భంలో లభించేటటువంటి కోరల్స్ జాతికి చెందిన వాటిని సేకరించి, వాటిని విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో డైరెక్ట్ రేట్ అఫ్ రెవిన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు దాడులు చేసినట్టుగా తెలుస్తోంది.కర్ణాటకలో ఈ ముఠాకు సంబంధించిన కొందరు నిందితులు అందించిన సమాచారంతో ఒంగోలు నంద్యాల జిల్లాల్లో దాడులు నిర్వహించారు. శ్రీశైలంలో వీటి విక్రయాలు జరుగుతున్న దుకానాలపై దాడులు చేసి సున్నిపెంటకు చెందిన వెంకట రమన,( ఆటో డ్రైవర్) రామాంజనేయులు అనే ఇద్దరిని అదులులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లుగా అధికారులు తెలిపారు. సముద్ర భూగర్భంలో ఉండే ఈ జీవరాశులను సేకరించటం అన్నది వైల్డ్ లైఫ్ ఆక్ట్ ప్రకారం నేరమని పులులు సింహాలు జింకలు లాంటి మృగాలను వేటాడితే ఎలాంటి చట్టాలు వర్తిస్తాయో ఆ చట్టాల కింద కేసులు నమోదు చేసి శిక్షించడం జరుగుతుందని అధికారులు తెలుపుతున్నారు.
వీటిని ఇంద్రజాలం, దృష్టి ఆకర్షణ పేరుతో ఫ్రేమ్స్ వేసి అమ్మకాలు జరుపుతున్నట్టు సమాచారంతో దాడులు జరిపినట్టు స్థానిక ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణతోనే అన్ని వర్గాలకు న్యాయం

### -ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ను కలిసిన కదిరికోట ఆదెన్న, ఆరెకంటి భాస్కర్.



ఆంధ్ర ప్రగతి ఎమ్మిగనూరు జనవరి 02:
ఎస్సీ వర్గీకరణ సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అభిప్రాయాల సేకరణకు గురువారం కర్నూలుకు విచ్చేశారు. కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియం నందు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరుకు చెందిన టిడిపి దళిత నాయకులు కదిరికోట ఆదెన్న, దళిత రచయితల సంఘం (ద. ర.సం)వ్యవస్థాపక అధ్యక్షులు ఆరెకంటి భాస్కర్ లు ఏకసభ్య కమిషన్ ను కలిసి వర్గీకరణ పై పలు అభిప్రాయాలను వెల్లబుచ్చి వినతిపత్రం అందజేశారు. మాదాసి కురువ, మదారి కురువ పేరుతో... బిసి (బి) కురుబ కులానికి చెందినవారు అక్రమంగా కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని ఫిర్యాదు చేశారు. ఎస్సీ 59 ఉపకులాలలో ఒకరైన బేడ, బుడగజంగాలు ఆంధ్రప్రదేశ్ లో అన్ని జిల్లాలలో ఉన్నారని ఇందుకు సాక్షాత్తు ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన కమిషన్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు సమర్పించినప్పటికీ జీ.వో. నెంబర్ 144 ను విడుదల చేసి వారికి తీరని అన్యాయం చేశారని ఆవేదన చెందారు. ఎస్సీ వర్గీకరణ అమలును రాష్ట్రం యూనిట్ గా తీసుకొని జనాభా దామాషా మేరకు ఏ బిసిడి గా వర్గీకరించాలని విన్నవించారు. రాష్ట్ర పరిధిలోని ఉద్యోగ నియామకాలతో పాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన పోస్టల్ డిపార్ట్ మెంట్, టెలికాం డిపార్ట్ మెంట్, బిఎస్ఎన్ఎల్, కేంద్రీయ విద్యాలయాలు, రైల్వే శాఖ ఉద్యోగాల నియామకాల తో పాటు కాంట్రాక్టు పద్ధతిలో నియమించే ఉద్యోగాలలో కూడా ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలని విన్నవించారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే అట్టడుగు ఉప కులాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. వీరి అభిప్రాయాలను విన్న కమిషన్ చైర్మన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ... బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రాక్షల దస్తగిరి, మంత్రాలయం నియోజకవర్గం దళిత నాయకులు సాల్మన్ రాజు, ఎమ్మిగనూరు నియోజకవర్గ బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు పూల చింత బండారి ఈరేష్, తదితరులు పాల్గొన్నారు.

# మనమంతా ఒక టీం..కలిసి పనిచేద్దాం...

# ప్రజల జీవితాలు మారుద్దాం..!

-పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణల అమలు.


-మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు.

-సచివాలయంలో వివిధ శాఖల ముఖ్యకార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు.

-పాజిటివ్ ఎనర్జీతో పనిచేద్దాం అని పిలుపు.

-తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలు వివరించిన సిఎం... అధికారుల అభిప్రాయల స్వీకరణ.

-కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించిన సిఎం చంద్రబాబు.




ఆంధ్ర ప్రగతి అమరావతి, జనవరి 02: రాష్ట్ర ప్రభుత్వంలోని ఆయా శాఖల్లోని కీలక అధికారులతో సిఎం చంద్రబాబు నాయుడు కొత్త సంవత్సరం సందర్భంగా కొద్ది సేపు ముచ్చటించారు. రోజువారీ సమీక్షలకు భిన్నంగా అధికారులతో కొత్త సంవత్సరం సందర్భంగా మాటామంతీ జరిపారు. తన ఆలోచనలు, ప్రాధాన్యతలు, లక్ష్యాలు వివరించిన సిఎం అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అంటూ అధికారులను ప్రోత్సహించారు. మనమంతా ఒక టీం.. కలిసి పనిచేద్దాం ప్రజల జీవితాలు మారుద్దాం అని వారికి సూచించారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మార్పు తేవాలనే సంకల్పానికి నూతనత్వం, సాంకేతికత జోడిస్తే శాఖల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని అధికారులకు సిఎం ఉద్బోధించారు. సిఎస్, డీజీపీ, సిఎంవో అధికారులతో పాటు వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా ఆయా అధికారులకు, వారి శాఖలో పనిచేసే ఉద్యోగులకు ముఖ్యమంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. ఒక పాజిటివ్ ఎనర్జీతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సిఎం అధికారులతో అన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పాలసీలకు సంబంధించి తన అనుభవాలను ముఖ్యమంత్రి గుర్తుచేసి వారిని మోటివేట్ చేశారు. 2025 సంవత్సరం లక్ష్యాలు ఏంటి, పనితీరు ఎలా ఉండాలనేది వారికి వివరించి కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. ప్రతి శాఖలో కూడా రిజల్ట్ ఓరియంటెడ్ గా పని జరగాలని సిఎం అభిప్రాయపడ్డారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ "ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో సంస్కరణలు అంటే పేదలకు వ్యతిరేకం అనే ప్రచారం ఉండేది. కానీ నాడు ధైర్యంగా సంస్కరణలు అమలు చేశాం. వెనుకడుగువేయకుండా కొత్త పాలసీలు తీసుకువచ్చి అమలు చేశాం. సంస్కరణలు పేదలకు వ్యతిరేకం కాదు.. పేదల జీవితాలు మార్చేవి అని నాడు తీసుకున్న నిర్ణయాలు నిరూపించాయి. అందుకే పేదల జీవితాలను మార్చే సంస్కరణల అమలులో ఎప్పుడూ చొరవ చూపుతాను. వాజ్ పేయి ప్రధాని గా ఉన్న సమయంలో రాష్ట్రంలో కూడా సంస్కరణలు మొదలుపెట్టాం. నేషనల్ హైవేల విషయంలో నాడు తీసుకున్న నిర్ణయంతో స్వర్ణచతుర్భుజి రోడ్లు వచ్చాయి. ఓపెన్ స్కై పాలసీ వల్ల విమానయాన రంగంలో అనూహ్య మార్పులు వచ్చాయి. పిపిపి విధానం వల్ల సంపద సృష్టి జరిగింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. నాడు హైదరాబాద్ లో చేసిన ప్రతి అభివృద్ధి నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంది" అని సిఎం అన్నారు. ఆయా నిర్ణయాల సమయంలో తాను ఎదుర్కొన్న విమర్శలను కూడా గుర్తుచేసుకున్నారు. అయినా సరే మంచి సంకల్పంతో తీసుకున్న నిర్ణయాల వల్ల ఫలితాలు వచ్చాయని సిఎం అన్నారు."విభజన తరవాత మళ్లీ ఎపిలో పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. 2019లో ప్రభుత్వం కొనసాగి ఉంటే రాష్ట్రం ఎంతో పురోగతి సాధించేది. రాష్ట్రాల అభివృద్ధిలో సుస్థిర ప్రభుత్వం అనేది కూడా ముఖ్యం. అప్పుడే అనుకున్న విధంగా ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ప్రజలకు మేలు రుగుతుంది"అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. "2024 ఎన్నికల్లో ప్రజలు తిరుగు లేని తీర్పు నిచ్చారు. ప్రభుత్వంపై అనేక ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వీటిని నెరవేర్చే క్రమంలో అనేక నిర్ణయాలు తీసుకున్నాం. పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలసీలు తెచ్చాం. ప్రభుత్వంపై నమ్మకంతో పెట్టుబడులు వస్తున్నాయి. ఇది మంచి పరిణామం. మనకున్న పేరుతో, కొత్తపాలసీతో మళ్లీ పెట్టుబడులు వస్తున్నాయి. ఒకప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాం...ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాం. దీనికి అనుగుణంగా సమస్త అధికార యంత్రాంగం పనిచేయాలి" అని సిఎం సూచించారు. "రాష్ట్రం ఉన్నపరిస్థితుల నేపథ్యంలో వేగంగా నిర్ణయాలు తీసుకోవాలి. తొందరగా ఫలితాలు రాబట్టాలి. టెక్నాలజీ సాయంతో చాలా మంచి ఫలితాలు వస్తాయి. ప్రతి శాఖలో టెక్నాలజీ వాడకాన్ని పెంచాలి. రానున్న రోజుల్లో 150 సర్వీసులు వాట్సాప్ ద్వారా ఇవ్వనున్నాం. దీనికి సమాయత్తం కావాలి. ఆధార్ ను సమర్థవంతంగా ఉపయోగిస్తాం. ప్రతి ఇల్లు జియో ట్యాగ్ చేస్తాం. పింఛన్లు ఇంటి వద్దనే ఇచ్చారా లేదా అనేది రియల్ టైంలో తెలిసిపోతుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సిసి కెమేరాలు, డ్రోన్లు, రియల్ టైం డాటాను సమర్థవంతంగా వినియోగిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. రెవెన్యూ శాఖలో చాలా సమస్యలున్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపాలి. రాత్రింబవళ్లు పనిచేయాల్సిన అవసరం లేదు. స్మార్ట్ వర్క్ చేయండి. టెక్నాలజీని వాడండి కచ్చితంగా ఫలితాలు వస్తాయి" అని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు."ప్రజలకు 5 ఏళ్ల కాలంలో ఏం చేయాలి అని మాత్రమే కాదు భవిష్యత్ అవసరాలను గుర్తించి విజన్ 2047ను తీసువచ్చాం. ఇందులో పేర్కొన్న 10 లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషిచేయాలి. అన్ని కార్యక్రమాలకు డబ్బుతోనే కాదు... కొత్త ఆలోచనలతో కొత్త మార్గాల్లో ప్రయాణం చేయాలి. మంచి చేయాలనే తపన, ఆలోచన ఉంటే చాలా అంశాల్లో ప్రజలకు మేలు చేయవచ్చు. 2025 సంవత్సరం ఆ తరహా ఆలోచనలకు వేదిక కావాలని కోరుకుంటున్నా. 2025 గేమ్ చేంజర్ లో కీలకం కావాలి. అతిపెద్ద మార్పుకు ఈ ఏడాదిలో నాంది పడాలి" అని సిఎం అన్నారు." రూ. 80 వేల కోట్లతో గోదావరి నీళ్లు బనకచర్లకు సాధ్యమా అని అడుగుతున్నారు. ఆర్థికంగా అతి పెద్ద ప్రాజెక్ట్.. అయినా సరే దీన్ని చేపట్టాలి. ఇది రాష్ట్ర దశ దిశ మారుస్తుంది. ఇప్పుడు చేపట్టకపోతే ఈ ప్రాజెక్టును ఇక ఎప్పటికీ చేపట్టలేం. ఇవన్నీ ప్రజల జీవితాల్లో నేరుగా మార్పులు తెచ్చే కార్యక్రమాలు" అని సిఎం అన్నారు."నేను మీ నుంచి వినూత్న ఆలోచనలు కోరుకుంటున్నా. 1995లో మా దగ్గర డబ్బు లేదు. కానీ ఆలోచనలతో మార్పు తెచ్చాం. అధికారులు సరికొత్త ఆలోచనలతో పనిచేస్తే ఫలితాలు వస్తాయి. కలిసి సమిష్టిగా, వేగంగా అడుగులు వేద్దాం. మనం ఎంత వేగంగా, సమర్థవంతంగా పనిచేస్తే అంత త్వరగా ఫలితాలు వస్తాయి అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా పాలనా అంశాలపై అధికారులు కొందరు తమ అభిప్రాయాలు చెప్పారు. అతి పెద్ద పెట్టుబడులు పెట్టే సంస్థల కార్యకలాపాలు వేగంగా కార్యరూపం దాల్చడం కోసం ఒక సీనియర్ ఐఎఎస్ అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించాలని సూచించారు. ఈ సూచనను సిఎం స్వాగతించారు. అలాగే ఆయా శాఖలకు సంబంధం ఉన్న పెద్ద పెద్ద సంస్థలు సిఎస్ఆర్ కోసం నిధులు ఖర్చు చేస్తాయని వాటిని ఒక గొడుగుకిందకు తెచ్చి మంచి ఫలితాలు వచ్చేలా వాటిని ఖర్చు చేసేలా చూడాలని సూచించారు. దీనికికూడా సిఎం అంగీకారం తెలిపారు. 2025 మార్పునకు, వేగానికి, పాలనను కొత్త పుంతలు తొక్కించడానికి, ప్రజల సంతృప్తిని పెంచడానికి వేదిక కావాలని... ఆ దిశగ అన్ని స్థాయిల్లో సిబ్బంది, అధికారులు, పనిచేయాలని సిఎం కోరారు.

## ఎస్సీ వర్గీకరణపై వన్ మ్యాన్ కమిషన్ వినితుల స్వీకరణ

### కర్నూల్ లో కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు - మూడంచెల భద్రత మధ్య లోనికి అనుమతి

కర్నూల్,జనవరి2ఆంధ్ర ప్రగతి: : షెడ్యూల్డ్ కులముల ఉపవర్గీకరణపై ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకుల నుంచి అభిప్రాయాలు, వినితుల స్వీకరణలో భాగంగా గురువారం కర్నూల్ కలెక్టరేట్ లోని ఆడిటోరియంలో రాజీవ్ రంజన్ మిశ్రా వన్ మాన్ కమిటీ.. సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూల్ కలెక్టరేట్ కి వివిధ షెడ్యూల్డ్ కులాలకు చెందిన కుల సంఘం నాయకులు, ఇతరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రత మధ్య టోకెన్లు ఇచ్చిన వారిని మాత్రమే కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలోకి అనుమతించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఏబీసీడీలు చేయాలా వద్దా.. చేస్తే ఎవరికి ఎంత పర్సంటేజీ.. అన్న అంశంపై ప్రధానంగా వినతులను ఆయా కుల సంఘాల నుంచి తీసుకోవడం జరిగింది.వన్ మ్యాన్ కమిషన్ కాకుండా, త్రీ మ్యాన్ కమిషన్ ను నియమించాలని, రాష్ట్రంలో రిజర్వేషన్లు విభజించేందుకు ఏర్పాటు చేసిన వన్ మ్యాన్ కమిషన్ రద్దు చేయాలని మాల మహానాడు నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అధిక శాతం ఉన్న దళితులకు 25శాతం రిజర్వేషన్లను అమలు చెయ్యాలి. పంజాబ్ రాష్ట్రంలో జరుగుతున్న రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్న మందక్రిష్ణ ఈ రాష్ట్రంలో అమలు కావాలంటే ఎందుకు ఒప్పుకోవడం లేదు. పంజాబ్ రాష్ట్రంలో 25శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుంది. అదే విధంగా మన రాష్ట్రంలో కూడా 25శాతం రిజర్వేషన్లు అమలు చెయ్యాలి. మంద కృష్ణ మాదిగ దళితుల అభివృద్ధిని ఎందుకు ఓర్చుకోలేకపోతున్నాడో అర్థం కావడం లేదని ప్రశ్నించారు.ఏబీసీ వర్గీకరణలో మాదాసి కురువను అనుమతించవద్దని.. మాల మహానాడుకు చెందిన కొందరు నేతలు డిమాండ్ చేశారు. వినతులు స్వీకరించే వద్ద వారికి టోకెన్లు ఇవ్వవద్దని నిరసనకు దిగారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

2008కి పూర్వం ఎస్సీలుగా ఉన్న బుడగ జంగాలను తిరిగి ఎస్సీలుగా గుర్తించాలని బుడగ జంగం రాష్ట్ర నాయకులు మనోహర్ డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. బుడగ జంగాలు పడుతున్న ఇబ్బందులను కమిషన్ దృష్టికి తెచ్చారు.


## ఈనెల 25 నుండి మార్చి 25 వరకు రీ సర్వే.

ఆంధ్ర ప్రగతి మహానంది జనవరి 2: మహానంది ఈనెల 25వ తేదీ నుండి మార్చి నెల 25వ తేదీ వరకు రీ సర్వే నిర్వహించనున్నట్లు మండల తహసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని తమ్మడపల్లె గ్రామం రీ సర్వే ఎంపిక అయిందని తెలిపారు. ఈ గ్రామంలో ఈనెల 4వ తేదీ నుండి 24వ తేదీ వరకు రికార్డులు పరిశీలించడం జరుగుతుందని అన్నారు. అనంతరం 25వ తేదీ నుండి రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. రైతులు తమ పొలాలకు సంబంధించి రికార్డులను సంబంధిత అధికారులకు చూపించి వ్యవసాయ భూములు ఎక్కువ, తక్కువ తో పాటు ఇతర సమస్యలు ఏవైనా ఉంటే పరిష్కరించుకోవాలని రీ సర్వేను అందరూ రైతులు ఉపయోగించుకొని, అధికారులకు సహకరించాలని సూచించారు. మహానంది మండలంలో తమ్మడపల్లె, బుక్కాపురం, గాజులపల్లె గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం తమ్మడపల్లి గ్రామం రీ సర్వేకు ఎంపిక అయినట్లు తహసిల్దార్ రమాదేవి పేర్కొన్నారు.

## రూ. 24 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదల.

-నూతన సంవత్సరంలో సీఎం చంద్రబాబు తొలి సంతకం.

-1,600 మంది పేదలకు అందనున్న ఆర్థికసాయం.



ఆంధ్ర ప్రగతి అమరావతి, జనవరి 02: నూతన సంవత్సరం తొలిరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు లబ్ది చేకూర్చేలా సీఎంఆర్ఎఫ్ నిధుల విడుదలకు సంబంధించిన ఫైలుపై మొదటి సంతకం చేశారు. దీంతో 1,600 మంది దరఖాస్తుదారులకు రూ. 24 కోట్ల మేర నిధులు విడుదల కానున్నాయి. గత ఏడాది అధికారం చేపట్టిన దగ్గర నుంచి డిసెంబర్ 31 వరకు రూ. 100 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు పేదవర్గాలకు ఇచ్చారు. 7,523 మందికి లబ్ది కలిగింది. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా చేసిన సంతకంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్ కోసం విడుదల చేసిన నిధుల మొత్తం రూ. 124.16 కోట్లకు చేరింది. 9,123 మంది మొత్తంమ్మీద ప్రయోజనం పొందినట్లయ్యింది.

## ఎపిలో కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో అపశ్రుతి

### కృష్ణా జిల్లాలో 1600 మీటర్ల పరుగు పందెంలో యువకుడు మృతి

అమరావతి,జనవరి2ఆంధ్ర ప్రగతి: ఎపిలో కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఫిజికల్ ఈవెంట్స్‌లో భాగంగా నిర్వహించిన పరుగు పందెంలో ఓ యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానిస్టేబుల్ దేహ ధారుడ్య పరీక్షల్లో భాగంగా కృష్ణా జిల్లాలో గురువారం జరిగిన 1600 మీటర్ల పరుగు పందెంలో ఏ.కొండూరు గ్రామానికి చెందిన ధరావత్ చంద్రశేఖర్ (25) అనే అభ్యర్థి పాల్గొన్నాడు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు లోనై కిందపడిపోయాడు. దీంతో పోలీస్ సిబ్బంది వెంటనే



అతన్ని చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.దీంతో తీవ్ర విషాదం నెలకొంది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో డిసెంబర్ 30 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రతి రోజూ ఆయా కేంద్రాల్లో 600 మంది చొప్పున అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో 6,100 పోలీస్ కానిస్టేబుల్స్ పోస్టుల భర్తీకి 2022, నవంబర్ 28న నోటిఫికేషన్ విడుదలైంది. గతేడాది జనవరి 22న ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి ఫిబ్రవరి 5వ తేదీన ఫలితాలు విడుదల చేశారు. మొత్తం 95,209 మంది అభ్యర్థులు ఫిజికల్ టెస్టులకు ఎంపికయ్యారు. వీరికి ప్రస్తుతం ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం3 జనవరి 2025



# వేడెక్కిన ఢిల్లీ ఎన్నికల రాజకీయం

## పోటాపోటీగా ఆప్, బిజెపిల పోస్టర్ల యుద్ధం

న్యూఢిల్లీ,:అసెంబ్లీ ఎన్నికల వేళ.. దేశ రాజధాని దిల్లీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆమ్‌ఆద్మీపార్టీ, భాజపా పోటీపడి వినూత్న ప్రచారం చేస్తున్నాయి. ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపుతూ, హామీల వర్షం కురిపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాజపా విడుదల చేసిన పోస్టర్‌కు ఆప్ తనదైనశైలిలో కౌంటర్ ఇచ్చింది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్ ఒకే అడ్రస్‌లో వందల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని భాజపా ఎక్స్ వేదికగా ఆరోపించింది. ఇంటి యజమానికి తెలియకుండా నకిలీ ఓటర్లను రిజిస్టర్ చేస్తున్నారని దుయ్యబట్టింది. ఇది కేజ్రీవాల్ కొత్త గేమ్ అంటూ తీవ్ర విమర్శలు చేసింది. ఆప్‌నకు నకిలీ ఓటర్లపై ప్రేమ అనే అర్థం వచ్చేలా ఒక పోస్టర్‌ను షేర్ చేసింది. దీనికి ఆప్ కౌంటర్ ఇచ్చింది. ఆ విమర్శను తిప్పి కొడుతూ 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) అంటూ కేజ్రీవాల్ ఉన్న ఒక పోస్టర్ వీడియోను పంచుకుంది. ఇదిలాఉంటే.. దిల్లీలో ఓటర్లకు భాజపా నగదు పంపిణీ చేస్తోందని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈమేరకు అరవింద్ కేజ్రీవాల్ ఆరెస్సెస్ అధ్యక్షుడు మోహన్ భాగవత్‌కు లేఖ రాశారు. కమలం పార్టీ చేస్తున్న తప్పిదాలను ఆరెస్సెస్ ఆమోదిస్తుందా? అని అందులో ప్రశ్నించారు. ఈ లేఖపై భాజపా స్పందిస్తూ.. ఇలా మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం ఆరెస్సెస్ అధ్యక్షుడికి లేఖ రాయడానికి బదులు ఆ సంస్థ నుంచి సేవా స్ఫూర్తిని నేర్చుకోవాలని కేజ్రీవాల్‌కు హితవు పలికింది. దేశ రాజకీయాల్లోనే ఆప్ అవిశ్వసనీయ పార్టీకి ఉదాహరణ అని, దీనిని ప్రజలు అర్థం చేసుకున్నారని భాజపా అధికార ప్రతినిధి సుధాన్శు త్రివేది ఎదురుదాడి చేశారు. అబద్ధాలు చెప్పడం మానుకోవడానికి నూతన సంవత్సరం రోజున కేజ్రీవాల్ తీర్మానించుకోవాలని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ కేజ్రీవాల్‌కు మరో లేఖ రాశారు.

# ప్రయాగ్ రాజ్‌లో మొదలైన కుంభ ఏర్పాట్లు

## అఖాడాల రాకతో సర్వత్రా సందడి వాతావరణం

లక్నో,,జనవరి2ఆంధ్ర ప్రగతి:

ప్రయాగరాజ్‌లో జరిగే మహాకుంభమేళాకు సంబంధించి సందడి మొదలయ్యింది.ఈ రోజుల్లో సూర్యోదయానికి ముందే నదిలో స్నానమాచరిస్తారు. స్వాతంత్ర్యానికి ముందు వరకూ అఖాడాలు, నాగ సాధువుల ఆధ్వర్యంలోనే మహా కుంభమేళా జరిగేది..కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వా ఆధ్వర్యంలో మహాకుంభమేళా లాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు జరుగుతున్నాయి. అప్పటి నుంచి సాధువుల పాత్ర పరిమితం అయింది. జనవరి 13 భోగి నుంచి ఫిబ్రవరి ఆఖరివారం శివరాత్రి వరకూ ప్రయాగరాజ్ లో జరిగే మహాకుంభమేళాకి దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కుంభమేళాలో సాధువులు, సన్యాసులు, అఘోరాలు, నాగ సాధువులు దర్శనమిస్తారు. వీరంతా ఆధ్యాత్మిక జీవితాన్ని సంపూర్ణం చేసుకునేందుకు భౌతిక ఆనందాలను విడిచిపెట్టి మోక్షాన్ని అన్వేషిస్తూ ఆఖరి శ్వాస వరకూ ఉండిపోతారు. మనదేశంలో ఇలాంటి వారు దాదాపు 50 లక్షల మంది వరకూ ఉన్నారని అంచనా. కుంభమేళా లాంటి అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవాల సమయంలో వీరు ఎక్కువగా కనిపిస్తారు.ప్రయాగ్ రాజ్ లో జరగనున్న మహాకుంభమేళాకి అఖాడాల సందడి మొదలైంది. వీరి ప్రవేశంతో మహాకుంభమేళా వేడుకలో మరింత భక్తిపూర్వకంగా మారింది. ఆచార్య మహామండలేశ్వర స్వామి విశ్వాత్మానంద సరస్వతి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగిన యాత్ర గజాననుడి సవారీతో ప్రయాణం ప్రారంభించారు. మొదట గజాననుడి సవారీ తర్వాత ఇతర దేవతల సవారీలు కూడా యాత్రలో చూడొచ్చు. అఖాడా



లను చూసేందుకు భక్తులు భారీగా తరలిచ్చారు. 20 మందికి పైగా మహా మండలేశ్వరులు, రెండు వందల మందికి పైగా నాగ సన్యాసులు యాత్రలో పాల్గొన్నారు. యాత్ర చేస్తూ మహాకుంభమేళాకి తరలివెళుతున్న అఘోరాల ఆశీర్వాదం కోసం భక్తులు పోటీ పడ్డారు. యాత్రలో పూలతో అలంకరించిన ఈటెలు ఉన్నాయి...వీటిలో 'సూర్య ప్రకాష్' అనే ప్రత్యేక బ్లెం ఉంటుంది..ఇది కేవలం ప్రయాగ్‌రాజ్ మహాకుంభ సమయంలో మాత్రమే అఖాడాలు ఆశ్రమం నుంచి బయటకు తీసుకొస్తారు. కుంభమేళాలో నాగ సాధువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారు. వీరి జీవన శైలి మిగిలిన ప్రజల కన్నా పూర్తి భిన్నంగా ఉంటుంది. సనాతన ధర్మాన్ని రక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. దుస్తులు, బంధాలను త్యజించి మనసుతో శరీరాన్ని శాసిస్తారు. నిరంతరం ధ్యానంలో ఉంటారు. బ్రహ్మచర్యం పాటిస్తారు. జనావాసాలకు దూరంగా ఉంటారు. అందుకే కుంభమేళా లాంటి ప్రత్యేక సమాయాల్లో గుంపులుగా తరలివచ్చే వీరిని చూసేందుకు భక్తులు పోటీపడతారు. నాగసాధువులు తమ ప్రతిజ్ఞలో భాగంగా కనీసం 12 సంవత్సరాలకు ఒకసారి కుంభమేళాలను సందర్శించాల్సి ఉంటుంది. కుంభమేళా లాంటి ఆధ్యాత్మిక ఉత్సవాల్లో సాధువులు భారీగా పాల్గొనేలా చేయడంలో అఖాడాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. సాధు సంస్థలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, సనాతన జీవన విధానాన్ని రక్షించేందుకు ఆదిశంకరాచార్యులు ఎనిమిదో శతాబ్దంలో అఖాడాలను స్థాపించారు. ఇప్పుడు కుంభమేళాలో ఎక్కువమంది సాధువులు పాల్గొనేలా చేయడంలోనూ అఖాడాలదే కీలకపాత్ర.

# చిన్మోయ్ కృష్ణ దాస్‌కు దక్కని బెయిల్

## 11మంది లాయర్ల బృందం ప్రయత్నాలు విఫలం

ఢాకా,:

దేశ ద్రోహం నేరారోపణతో బంగ్లాదేశ్‌లో అరెస్టయి జైల్లో ఉన్న హిందూ సాధువు చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట లభించలేదు. ఆయన బెయిల్ పిటిషన్‌ను చటోగ్రామ్‌లోని కోర్టు తిరస్కరించింది. బెయిల్ కోసం 11 మంది లాయర్ల బృందం ప్రయత్నించినప్పటికీ అది ఫలించలేదు.

బంగ్లాదేశ్ లోని చటోగ్రామ్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టులో 30 నిమిషాల పాటు ఈ బెయిల్ పిటిషన్‌పై వాదనలు జరిగాయి. చిన్మయ్ అరెస్టు అనంతర పరిణామాలను దృష్టిలోపెట్టుకొని గురువారం న్యాయస్థానం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రస్తుతానికి ఆయనకు బెయిల్ ఇవ్వలేమని కోర్టు తేల్చిచెప్పింది.బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గతేడాది నవంబరులో చిట్టగాంగ్‌లో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. అక్కడ బంగ్లా జాతీయజెండాను అగౌరవ పరిచారనే అభియోగాలపై 2024 నవంబరు 25న పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. అనంతరం జైలుకు తరలించారు. ఆయన తరఫున వాదనలు వినిపించేందుకు ఓ న్యాయవాది ప్రయత్నించగా.. అతడిపై ఆందోళనకారులు దాడి చేశారు. మరో సీనియర్ న్యాయవాది కేసును టేకప్ చేయగా.. ఆయనపైనా బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిన్మయ్ కేసును వాదించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు చిన్మయ్ భాగస్వామిగా ఉన్న సమ్మిళిత సనాతన జాగరణ్ జోతే అనే సంస్థ.. 11 మందితో లాయర్ల బృందాన్ని ఏర్పాటుచేసింది. హిందూ సాధువు చిన్మోయ్ కృష్ణ దాస్ బంగ్లాదేశ్‌లో



నెల రోజులకు పైగా జైలులో ఉన్నారు. ఈ క్రమంలో కూడా ఆయనకు మళ్లీ షాకింగ్ న్యూస్ వచ్చింది. గురువారం చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో విచారణ జరిపి ఆయన బెయిల్‌ను తిరస్కరించారు. దీంతో చిన్మయ్ దాస్ మరికొంత కాలం జైల్లోనే ఉండాల్సి ఉంటుంది. బెయిల్ విచారణ సమయంలో 11 మంది న్యాయవాదులతో కూడిన బెంచ్ విచారణలో పాల్గొన్నా కూడా, చిన్మోయ్ కృష్ణ దాస్‌కు బెయిల్ లభించలేదు. అంతకుముందు డిసెంబర్ 11న బంగ్లాదేశ్ కోర్టు దాస్ ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విధానపరమైన లోపాల కారణంగా తిరస్కరించింది. ఇది చాలా బాధాకరమైన వార్త అని కోల్‌కతా ఇస్కాన్ వీపీ రాధా రామన్ అన్నారు. ప్రపంచం మొత్తం దీన్ని గమనిస్తోందన్నారు. కొత్త సంవత్సరంలో చిన్మయ్ ప్రభుకి స్వేచ్ఛ లభిస్తుందని అందరూ ఆశించారని పేర్కొన్నారు. అయితే 42 రోజుల తర్వాత కూడా ఈరోజు విచారణలో ఆయన బెయిల్ తిరస్కరించబడింది. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.చిన్మోయ్ కృష్ణ దాస్‌పై బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచినట్లు ఆరోపణలు పెడుతూ దేశద్రోహం కేసు నమోదు చేయబడింది. ఈ కేసులో ఆయన తరపున న్యాయవాది అపూర్బా కుమార్ భట్టాచార్జీ నేతృత్వంలో బంగ్లాదేశ్ న్యాయవాదులు వాదిస్తున్నారు. 2024 నవంబర్ 25న ఛటోగ్రామ్‌లోని హజ్రత్ షాజలాల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను అరెస్టు చేసిన తరువాత, బంగ్లాదేశ్ న్యాయవాదుల బృందం ఈ కేసును విచారిస్తోంది.

# అన్నదాతలను వంచిస్తున్న ప్రభుత్వాలు !



జనవరి2ఆంధ్ర ప్రగతి:

వ్యవసాయ సంక్షోభాన్ని అధ్యయనం చేసి, అన్నదాతలను గట్టెక్కించే ప్రయత్నాలు ఏవీ ముందుకు రావడం లేదు. హామీలన్నీ అటకెక్కుతున్నాయి. ఎన్నికల ముందు అన్ని పార్టీలు అన్నదాతల గురించి, వారి సమస్యల గురించి చర్చిస్తారు. అందమైన అబద్ధాలను ఇంపుగా చెబుతారు. గద్దెనెక్కాక యధావిధిగా మర్చిపోతున్నారు. అందుకే దేశంలో వ్యవసాయరంగం లాభసాటిగా లేకుండా పోతోంది. రైతులకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. మద్దతు ధరల విధానం సక్రమంగా అమలు కావడం లేదు. దగాపడుతున్న అన్నదాతను ఆదుకునే ప్రయత్నాలు కేవలం కంటితుడుపు చర్యగానే ఉన్నాయి. సకాలంలో ఎరువుల అందవు. విత్తనాల కొరత యధావిధిగా ఉండనే ఉంటుంది. ఎరువులు, నకిలీ విత్తనాలు, మార్కెట్లో మోసాలను తట్టుకుని మనకు అన్నం పెడుతున్న రైతన్న విషయంలో ఏ ప్రభుత్వం అయినా న్యాయం చేయడం లేదు. నిలదీస్తే వారిని నిలువరిస్తున్నారు. దేశంలో గత మూడు దశాబ్దాల్లో నాలుగు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఇటీవల సుప్రీంకోర్టు తనకందిన అధికారిక నివేదిక నుంచి పేర్కొంది. నివేదికలకెక్కని చావులను కూడా పరిగణన లోకి తీసుకుంటే ఈ ఆత్మహత్యల లెక్క ఏడు లక్షలకు పైబడే ఉంటుందని పరిశీలకుల అంచనా. వ్యవసాం ఒక ప్రధాన జీవన రంగంగా సాగుతున్న దేశంలో రైతుల పరిస్థితి ఇంత దుర్భరంగా ఉండడం చాలా బాధాకరం. కేంద్ర ప్రభుత్వం రైతుల కష్టాలను తీర్చకపోగా ఎరువుల ధరలను పెంచి, సహకార వ్యవస్థలను, మార్కెట్టు యార్డులను నిర్వీర్యపర్చి మరిన్ని ఇక్కట్లకు గురి చేస్తోంది. కేంద్రంలోని బిజెపి తాను అమలు చేస్తామని అనేకసార్లు వల్లించిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి తదితర 11 డిమాండ్లతో ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. రైతు నాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లేవాల్ నవంబరు 26వ తేదీన నిరాహార దీక్ష చేపట్టి నెలరోజులు గడిచిపోయినా కేంద్రప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేకపోవటం శోచనీయం. ఎండనక వాననక ఆరుగాలం చెమటోడ్చి కష్టించే అన్నదాతలకు ప్రకృతి వైపరీత్యాలతో ఎదురయ్యే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. వాటికి అదనంగా దళారుల మోసాలు, మార్కెట్ ధర పతనాలు, రవాణా భారాలూ చేరి, కష్టాలూ కన్నీళ్లే దిగుబడులుగా వ్యవసాయాన్ని వ్యయభరితంగా మార్చేశాయి. ఈ దుర్భర స్థితి నుంచి రైతును రక్షించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కష్టాలను మరింత పెంచుతు న్నాయి తప్ప, భరోసాగా నిలవటం లేదు. మోసకారి విధానాలతో అన్నదాతల ఉసురు పోసుకోవటం పాలకులకు పరిపాటిగా మారింది. రైతు దేశానికి వెన్నెముక అంటూ ఉపన్యాసాలు ఊదరగొట్టే ప్రభుత్వాలు ఆ వెన్నెముకను కర్కశంగా విరిచేసే చేతలకు తెగిస్తున్నాయి. చేసిన శ్రమకు, ఉత్పత్తికి కనీసంలో కనీసంగా ఖరీదు కట్టటం అనేది ఒక సాధారణ న్యాయం. కానీ, ఈ సాధారణ న్యాయం దశాబ్దాల తరబడి రైతులకు అందటం లేదు. పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలన్న అంశానికి చట్టబద్ధత కల్పించటం ఇంకా ఎండమావిగానే ఉంది. వ్యవసాయరంగం సంక్షోభం నుంచి బయటపడటానికి గతంలో స్వామినాథన్ కమిషన్ కొన్ని సిఫార్సులు చేసింది. పంటలకు మద్దతు ధరను ఇవ్వాలని, సింగిల్ యూనిట్ ప్రాతిపదికన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని, మార్కెట్ సదుపాయాలు పెంచాలని సూచనలు చేసింది. దశాబ్దం క్రితం వరకూ అధికారంలోకి రాక ముందు బిజెపి బలంగా వినిపించిన ఎన్నికల వాగ్దానాల్లో ఇవన్నీ ఉన్నాయి. గద్దెనెక్కాక ఆ హామీలను ఆవలకు విసిరేసి, రైతులకు పంగనామాలు పెట్టే పనికి సమాయత్తమైంది! ఉన్న రాయితీలను తీసేసి, మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి, కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే దుస్సాహసానికి ఒడిగట్టింది. వాటిని వెనక్కి తీసుకోవాలని లక్షలాదిమంది రైతులు నెలల తరబడి, ఢిల్లీ సరిహద్దుల్లో చారిత్రాత్మక పోరాటం చేశారు. తప్పని పరిస్థితుల్లో మోడీ క్షమాపణలు చెప్పి, ఆ చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ, ఆ తరువాత ఈ మూడేళ్లలో రైతులను ఉద్ధరించే చర్య ఒక్కటంటే ఒక్కటీ చేపట్టలేదు. ఏడాదికి మూడు విడతలుగా విదిల్చే రూ.6 వేల సహాయాన్నే గొప్ప ఉపకారంగా మోడీ పరివారం చెప్పుకుంటోంది. అలాంటి అరకొర విదిలింపులతో దేశ వ్యవసాయ రంగానికి ఒరిగేది ఏమీ ఉండదు. రైతు సమస్యలపై అధ్యయనం చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇటీవల విడుదల నివేదిక కూడా దీనినే స్పష్టం చేస్తోంది. కనీస మద్దతు ధరకు గ్యారంటీ, రుణమాఫీ, పిఎం కిసాన్ నిధుల రెట్టింపు, బ్జడెట్లో వ్యవసాయరంగ వాటా పెంపు వంటి ప్రతిపాదనలు చేసింది. మోడీ ప్రభుత్వం తాను చెప్పుకుంటున్నట్టు రైతులకు ఇప్పటికే చాలా మేళ్లు చేసివుంటే– కొత్తగా ఈ ప్రతిపాదనలు ఎందుకు? రైతాంగం పట్ల కత్తి కట్టినట్టు వ్యవహరించే ధోరణికి బిజెపి ప్రభుత్వం ఇకనైనా స్వస్తి పలకాలి. రైతుల న్యాయమైన డిమాండ్లను తక్షణం నెరవేర్చాలి.భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే ఉదారవాద ఆర్థిక విధానాలను విడనాడాలి. రైతు నిశ్చింతగా ఉండటానికి, వ్యవసాయ రంగం నిలబడటానికి ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలి. వీటి విషయంలో ఖచ్చితమైన నిబంధనలు రావాలి. అప్పనంగా రైతుల న ఉంచి భూములను లాక్కోవడం, వారికి అరకొరగా విదిల్చడం చేస్తున్నారు. మద్దతు ధరలు, ఎరువుల విధానం, మార్కెట్ల బలోపేతం వంటివన్నీ సక్రమంగా జరగాలి. భూములను అప్పనంగా గుంజుకునే విధానం పోవాలి. లాఠీఛార్జీలు చేయడం, వారిని రోడ్డెక్కించే బరితెగింపు పనులు ఇకముందు సాగకుండా చూడాలి. పారిశ్రామిక వేత్తలకు భూములు కావాలంటే బహిరంగ వేలంలో కొనుగోలు చేసుకునేలా కఠిన చట్టాలు తీసుకుని రావాలి. ఇలా చేస్తే తప్ప అన్నదాత మనుగడ సాగదు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# బస్సులపై తెగిపడ్డ విద్యుత్ వైర్లు

## దివాకర్ బస్సులు దగ్ధం



అనంతపురం,:అనంత నగరంలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సులు దగ్ధమయ్యాయి. అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో జేసీ దివాకర్ రెడ్డికి చెందిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు దగ్ధమయ్యాయి. బస్సులపై కేవీ 11 వైర్ తెగి నిప్పురవ్వలు పడడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగలు చుట్టుప్రక్కల వ్యాపించాయి. దీంతో భయాందోళనలకు గురైన స్థానికులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదంలో 4 బస్సులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం గురువారం తెల్లవారుజామున జరిగింది. బస్సుల వద్ద ఎవరూ లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# స్టీల్ ఫ్యాక్టరీలో ప్రమాదం

## ఏడుగురు కార్మికులకు గాయాలు

తిరుపతి,: తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద ఎంఎస్ అగర్వాల్ స్టీల్ ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలోని ఫర్నేస్ బాయిలర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. పెద్ద శబ్దంతో బాయిలర్ పేలిపోయింది. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న ఏడుగురు కార్మికులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ వారిని నాయుడుపేట, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా, స్టీల్‌ప్లాంట్‌లో రాత్రి షిఫ్టులో 50 నుంచి 70 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వీరంతా బీహార్‌వాసులేనని స్థానికులు చెబుతున్నారు. యాజమాన్యం వివరాలు చెప్పకుండా గోప్యత పాటిస్తుండటంతో అంతా అయోమయం నెలకొంది.


# అసదుద్దీన్ పిటిషన్ విచారణకు సుప్రీం ఒకే

న్యూఢిల్లీ,: 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఇవాళ అంగీకారం తెలిపింది. 1947, ఆగస్టు 15వ తేదీ నాడు మతపరమైన స్థలాల అంశంలో ఎటువంటి చట్టం అమలులో ఉందో, అదే తరహా విధానాన్ని మెయిన్‌టేన్ చేయాలని ఆ పిటీషన్‌లో కోరారు. చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణ చేపట్టింది. ప్రార్థనా స్థలాలకు చెందిన కేసులతో లింకున్న వాటికి అసద్ పిటీషన్‌ను జోడించాలని సుప్రీం ఆదేశించింది. ఫిబ్రవరి 17వ తేదీ ఆ పిటీషన్‌పై విచారణ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఎంపీ అసదుద్దీన్ తరపున అడ్వకేట్ నిజాం పాషా వాదించారు.




# ముండ్లమూరులో మరోసారి భూకంపనలు

ప్రకాశం జనవరి 2 :పకాశం జిల్లాలో మరోసారి భూప్రకంపనలు భయాందోళనలకు గురిచేశాయి. గురువారం మధ్యాహ్నం జిల్లాలోని రేపాయి, ముండ్లమూరు మండలంలోని గ్రామాల్లో సెకన్ పాటు భూమి కంపించింది. దీంతో భయాందోళనకు గురైన స్థానికులు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. గత నెల ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండలంలో గత నెల 21,22వ తేదీల్లో వరుసగా ఉదయం 10.35 నుంచి 10.40 గంటల మధ్య కొన్ని క్షణాలపాటు రెండురోజులు భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు లోనయ్యారు. ముండ్లమూరు, శింగన్నపాలెం, వేంపాటు, పెద్దఉల్లగల్లు, పసుపుగల్లు గ్రామాల్లో భూమి కంపించిందని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. తాజాగా గురువారం కూడా ఇదే మండలంలోని పలు గ్రామాల్లో భూమి కంపించడం ఆందోళనకు గురి చేస్తుందని గ్రామస్థులు పేర్కొన్నారు.



# గోవాలో ఏపీ యువకుడి దారుణ హత్య

హైదరాబాద్, జనవరి 2 (ఆర్‌ఎన్‌ఎ): న్యూ ఇయర్ వేడుకల వేళ గోవాలో దారుణం జరిగింది. కొత్త సంవత్సరం వేడుకలకు గోవా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. న్యూ ఇయర్ వేడుకల కోసం తాడేపల్లిగూడెం నుంచి ఓ ఎనిమిది మంది యువకులు గోవా వెళ్లారు. డిసెంబర్ 29వ తేదీన అర్ధరాత్రి గోవాలోని ఓ రెస్టారెంట్‌లో 8 మంది దిగారు. 31న అర్ధరాత్రి ఫుడ్ ఆర్డర్ విషయంలో వీరికి.. రెస్టారెంట్ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఫుడ్ రేట్ల గురించి ప్రశ్నించిన యువకులపై రెస్టారెంట్ నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రవితేజ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా రవితేజ ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై రవితేజ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# నేడు ఈడీ ముందుకు హాజరుకానున్న అరవింద్‌కుమార్



హైదరాబాద్,:
రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ రేసింగ్ కేసులో విచారణకు రావాల్సిందిగా మాజీ మంత్రి కేటీఆర్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి, ఐఏఎస్ అధికారు అరవింద్ కుమార్‌కు ఈడీ నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను ఈడీ ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే విచారణకు సంబంధించి ఈడీకి ఐఏఎస్ అధికారి తాజాగా లేఖ రాశారు. రేపు విచారణకు హాజరుకాలేనని లేఖలో అరవింద్ కుమార్ పేర్కొన్నారు. విచారణకు హాజరయ్యేందుకు కొంత సమయం ఇవ్వాలని ఐఏఎస్ అధికారి కోరారు. మరి అరవింద్ కుమార్ లేఖపై ఈడీ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. మరోవైపు ఇదే కేసులో హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్ రెడ్డి ఈరోజు ఈడీ ముందు విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే ఈడీ విచారణకు ఆయన డుమ్మా కొట్టారు. ఫార్ములా ఈ రేస్ కేసును దర్యాప్తు జరుపుతున్న జాయింట్ డైరెక్టర్‌కు బీఎల్‌ఎన్ రెడ్డి మెయిల్ చేశారు. విచారణకు రావడానికి తనకు మరింత సమయం కావాలని ఆయన కోరారు. బీఎల్‌ఎన్ రెడ్డి మెయిల్‌కు ఈడీ అధికారులు సానుకూలంగా స్పందించారు. తిరిగి ఎప్పుడు విచారణకు రావాలో తెలుపుతామని బీఎల్‌ఎన్ రెడ్డికి ఈడీ అధికారులు చెప్పారు. మరోవైపు ఈనెల 7న హాజరుకావాల్సిందిగా మాజీ మంత్రి కేటీఆర్‌కు కూడా ఈడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే బీఎల్‌ఎన్ రెడ్డి, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విచారణకు డుమ్మా కొట్టిన నేపథ్యంలో మరి కేటీఆర్ కూడా విచారణకు హాజరవుతారా లేదా అనేది సస్పెన్స్‌గా మారింది. కాగా.. ఫార్ములా ఈ రేసింగ్ కేసులో అవకతవకలు జరిగాయని.. భారీగా నిధుల మళ్లింపు జరిగిందని నిర్ధారించిన ఏసీబీ ముగ్గురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఏ1గా కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, ఏ3గా బీఎల్‌ఎన్ రెడ్డిని చేర్చుతూ ఏసీబీ కేసు ఫైల్ చేసింది. ఏసీబీ కేసు నమోదు చేయడంపై కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ కేసును కొట్టివేయాల్సిందిగా హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేయగా.. న్యాయస్థానంలో కేటీఆర్‌కు ఊరట లభించింది. మొదటి రెండు సార్లు జరిగిన విచారణలో గత ఏడాది డిసెంబర్ 31 వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశించింది. తాజాగా డిసెంబర్ 31న జరిగిన విచారణలో కేటీఆర్‌ను ఎలాంటి అరెస్ట్ చేయవద్దంటూ పోలీసులను ఆదేశిస్తూ.. తీర్పును రిజర్వ్ చేసింది హైకోర్టు. అలాగే ఏసీబీ కేసుపై కేటీఆర్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. నూతన సంవత్సరం మొదటి రోజు ఈ కేసుపై మాట్లాడిన ఆయన న్యాయస్థానాలపై తనకు నమ్మకం ఉందని అన్నారు. న్యాయస్థాన తీర్పుపై తాను కూడా వెయిట్ చేస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ కేసు లొట్టపీసు కేసు అంటూ వ్యాఖ్యలు చేశారు. తనను అరెస్ట్ చేయాలని రేవంత్ సర్కార్ పట్టుబట్టి కూర్చుందంటూ మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

# చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభోత్సవం తేదీ ఖరారు




హైదరాబాద్, :
చర్లపల్లి రైల్వే టెర్మినల ప్రారంభోత్సవం తేదీ ఖరారైంది. జనవరి 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్నారు. రూ.413 కోట్లతో ఏర్పాటు చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను గతేడాది డిసెంబర్ 28 ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో కార్యక్రమం వాయిదా పడింది. మాజీ ప్రధాని మృతి కారణంగా వారం రోజులపాటు కేంద్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించింది. ఈ మేరకు కార్యక్రమం వాయిదా పడింది. అయితే తాజాగా జనవరి 6వ తేదీన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్, కిషన్ రెడ్డి నేరుగా పాల్గొనగా.. ప్రధాని మోదీ మాత్రం వర్చువల్‌గా హాజరై రైల్వే టెర్మినల్‌ను ప్రారంభిస్తారు. అయితే రెండు నెలల్లో మొత్తం నాలుగు సార్లు టెర్మినల్ ప్రారంభోత్సవం వాయిదా పడడం రైల్వే వర్గాలను తీవ్రంగా నిరాశపరిచింది. మరో కొత్త తేదీ ప్రకటించడంతో ఈసారైనా ఎలాంటి అవాంతరాలూ లేకుండా కార్యక్రమం జరగాలని రైల్వే అధికారులు, తెలంగాణ వాసులు కోరుకుంటున్నారు. జనవరి 6న చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైతే సుమారు 50 వేల మంది ప్రయాణికులకు మోక్షం లభిస్తుంది. గంటల తరబడి ట్రాఫిక్ సమస్య నుంచి వారికి విముక్తి కలుగుతుంది. చర్లపల్లి వద్ద ప్రస్తుతం 26 రైళ్లు ఆగుతుండగా.. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ 50 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. దీంతో వేగంగా గమ్య స్థానాలకు వెళ్లే అవకాశం ఉంటుంది. రైల్వే అధికారులు ప్రస్తుతం ఇక్కడ 2 ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి మొత్తం 9 ప్లాట్‌ఫాంలు, 6 ఎస్కలేటర్లు, 2 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రయాణికుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు రచించారు. వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు వంటివి సైతం సిద్ధం చేశారు. ఇది ప్రారంభమైతే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లపై ప్రయాణికుల భారం తగ్గనుంది.

# బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో అవకతవకలు

## ప్రశాంత్ కిశోర్ ఆమరణ నిరాహార దీక్ష



పట్నా,: ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఇటీవల బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు వారాలుగా బీపీఎస్సీ అభ్యర్థులు తీవ్ర ఆందోళనలు చేపడుతున్నా, ప్రభుత్వంలో ఎలాంటి కదలిక రాలేదంటూ గాంధీ మైదానంలో ఆయన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేసి.. మళ్లీ కొత్తగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరీక్షలో అవకతవకలకు కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనకారుల బృందం సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అమృత్‌లాల్ మీనాను కలిసిన తర్వాత కిశోర్ మీడియాతో మాట్లాడుతూ.. 48 గంటల్లోగా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే దీక్షకు దిగుతానని అన్నారు. ఆ సమయం ముగిసినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఆయన ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. డిసెంబర్ 13న నిర్వహించిన బీపీఎస్సీ కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో నిరుద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. పరీక్షను రద్దు చేసి.. కొత్తగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పరీక్షను రద్దు చేసే ప్రసక్తే లేదని అధికారులు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో ఉద్యోగార్థులు తమ ఆందోళనల్ని ఉధృతం చేయగా.. ప్రశాంత్ కిశోర్ వాళ్లకు మద్దతుగా నిలిచారు.

# కాకినాడలో గంజాయి గ్యాంగ్ దారుణం



కాకినాడ: కాకినాడలో గంజాయి గ్యాంగ్ దారుణానికి పాల్పడింది. కానిస్టేబుల్స్‌పై కారును నడిపివారికి ప్రమాదానికి గురయ్యేలా చేసింది. అయితే యాక్సిడెంట్ చేసిన గంజాయి గ్యాంగ్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది. కారులో ఉన్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కృష్ణవరం గ్రామంలో టోల్ ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా కారును కానిస్టేబుళ్ల మీద నుంచి గంజాయి బ్యాచ్ పోనిచ్చింది. దీంతో ఇద్దరు కానిస్టేబుల్స్ గాయపడ్డారు. రాజానగరం వద్ద కారును వదిలేసి వారు పరారయ్యారు. ఈ ఘటనలో కానిస్టేబుల్స్ ఇద్దరు గాయపడి ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే కానిస్టేబుల్ పై దాడి జరిగిన సమాచారాన్ని తెలియ చేయకపోవడంతో జిల్లా ఎస్పి సీరియస్ అయ్యారు. సిఐని దీనిపై వివరణ కోరినట్లు తెలిసింది. అయితే గంజాయి గ్యాంగ్ చిక్కడంతో వారిని విచారిస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ రిజిస్ట్రేషన్ కు చెందిన కారులో గంజాయి గ్యాంగ్ పరారయ్యారు. అయితే పోలీసులు వారిని పట్టుకోగలిగారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారని సమాచారం.

# క్రీడా అవార్డులు ప్రకటించిన కేంద్రం

## తెలుగు తేజాలు యర్రాజి జ్యోతి, జీవాంజి దీప్తిలకు

# అర్జున పురస్కారాలు



యర్రాజి జ్యోతి





న్యూఢిల్లీ,: క్రీడా రంగంలో విశేష ప్రతిభకనబరిచిన క్రీడాకారులను అవార్డులతో కేంద్రం గౌరవించింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలకు నలుగురిని ఎంపిక చేసిన కేంద్రం.. అర్జున అవార్డుకు 32మందిని, ద్రోణాచార్య అవార్డుకు ఐదుగురిని ఎంపిక చేసింది. భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024 ఏడాదికి గాను నలుగురు క్రీడాకారులను ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలకు ఎంపిక చేసింది. చెస్ విభాగంలో డి.గుకేశ్, హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్, షూటింగ్ విభాగంలో మను బాకర్‌ను ఈ అవార్డులు వరించాయి. అలాగే, 32మందిని అర్జున, ఐదుగురికి ద్రోణాచార్య పురస్కారాలకు ఎంపిక చేశారు. అర్జున పురస్కారాలు దక్కించుకున్నవారిలో 17మంది పారా అథ్లెట్స్ ఉండటం విశేషం. జనవరి 17న ఉదయం 11గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసే ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా వీరంతా పురస్కారాలను అందుకుంటారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడామంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది. భారత స్వాతంత్య్రం వచ్చాక.. ఒకే ఒలింపిక్ గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి అథ్లెట్‌గా మను బాకర్ ఘనత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ వ్యక్తిగత విభాగంతోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యాలను సొంతం చేసుకుంది. తొలి జాబితాలో ఆమె పేరు లేకపోవడంతో తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. ఇప్పుడు ప్రకటించిన జాబితాలో పేరు ఉండటంతో క్రీడాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన గుకేశ్‌కు ఖేల్ రత్న అవార్డు వరించింది. ఫైనల్‌లో చైనా ప్లేయర్‌పై అద్భుత విజయంతో ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలింపిక్స్‌లో వరుసగా భారత్ రెండో పతకం సాధించడంలో హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక పాత్ర పోషించాడు. పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హై జంప్ విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఇక అర్జున అవార్డులు దక్కిన వారిలో ఇద్దరు తెలుగు అమ్మాయిలు ఉన్నారు. జ్యోతి యర్రాజి (అ÷–లథెటిక్స్),దీప్తి జువ్వాంజి ఉన్నారు.

ఇక మిగిలిన వారిలో అన్ను రాణి (అ÷–లథెటిక్స్), నీతు (బాక్సింగ్), స్వీటీ బురా (బాక్సింగ్), అవంతిక అగర్వాల్ (చెస్), సలీమా (హాకీ), అభిషేక్ (హాకీ), సంజయ్ (హాకీ), జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సుఖ్‌జీత్ సింగ్ (హాకీ) స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్), సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్),అమన్ (రెజ్లింగ్),రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్),ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్),అజీత్‌సింగ్ (పారా అథ్లెటిక్స్),సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్),ప్రణవ్ సూర్మ (పారా అథ్లెటిక్స్),హెచ్. హోకాటో సీమ(పారా అథ్లెటిక్స్), సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్), నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్), తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్), నిత్య శ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)

మనీశా రాం దాస్ (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జుడో),మోనా అగర్వాల్ (పారా షూటింగ్)

రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్), అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్), సుచా సింగ్ (అ÷–లథెటిక్స్), మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్) ఉన్నారు. ఇక ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు) దక్కించుకున్న

వారిలో సుభాష్ రాణా (పారా షూటింగ్), దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సంగ్వాన్ (హాకీ), లైఫ్‌టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) ఉన్నారు.





# శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్‌లకు సీఐడీ సమన్లు!

## గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా పోంజీ స్కామ్ సంచలనం




**అధిక వడ్డీ ఆశచూపి ప్రజల వద్ద నుంచి రూ.6వేల కోట్లు సేకరించిన బీజెడ్ గ్రూప్**

**ఇప్పటికే సీఐడీ అదుపులోకి బీజెడ్ గ్రూప్ అధినేత భూపేంద్ర సింగ్ ఝులా**

**బీజెడ్ గ్రూపులో గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు పెట్టుబడి పెట్టిన వైనం**

**గిల్, సాయి సుదర్శన్, మోహిత్ శర్మ, రాహుల్ తేవాటియా తదితరుల ఇన్వెస్ట్‌మెంట్**

రూ. 6వేల కోట్ల పోంజీ స్కామ్ గుజరాత్‌తో పాటు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ కుంభకోణం సెగ క్రికెటర్లను తాకింది. అధిక వడ్డీ ఆశచూపి ప్రజల వద్ద నుంచి రూ.6వేల కోట్లు జమ చేసిన బీజెడ్ గ్రూప్ అధినేత భూపేంద్ర సింగ్ ఝులాను ఇప్పటికే సీఐడీ అదుపులోకి తీసుకుంది. కాగా, బీజెడ్ గ్రూపులో ఐపీఎల్ ఫ్రాంచైజీ గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, మోహిత్ శర్మ, రాహుల్ తేవాటియా తదితరులు ఇందులో పెట్టుబడి పెట్టారట. బీజెడ్ గ్రూపునకు చెందిన రూ.450 కోట్లకు సంబంధించిన లావాదేవీలపై ప్రస్తుతం సీఐడీ విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగా జీటీ క్రికెటర్లకు సమన్లు జారీ చేయనుందని తెలుస్తోంది. వారి నుంచి వివరాలు సేకరించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకోనుందని సమాచారం. ఇక గిల్ బీజెడ్ గ్రూపులో రూ. 1.95 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు అహ్మదాబాద్ మిర్రర్ నివేదిక వెల్లడించింది. అలాగే ఇతర క్రికెటర్లు కూడా తక్కువ మొత్తాల్లో ఇన్వెస్ట్ చేసినట్లు తెలిపింది. కాగా, శుభ్‌మన్ గిల్ ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ) సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో ఉన్న విషయం తెలిసిందే. ఈ సిరీస్ ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత అతనికి సమన్లు జారీ చేసి.. విచారించే అవకాశం ఉంది

# తుది జట్టు కూర్పుపై సమాలోచనలు

## కసరత్తు చేస్తున్న గంభీర్, రోహిత్

## రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్ జట్టులోకి?

## పిచ్ పరిశీలించిన తర్వాతే ప్రకటిస్తామన్న గంభీర్








బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీలో జరగబోయే ఐదో టెస్ట్ లో గెలవాలన టీమిండియా పట్టుదలగా ఉంది. అయితే తుది జట్టు కూర్పుపై జట్టు మేనేజ్ మెంట్ చర్చలు కొనసాగిస్తోంది. ఇండియా ఈ సిరీస్ లో మ్యాచ్ మ్యాచ్ కు మార్పులు చేస్తూనే వచ్చింది. మొదటి మ్యాచ్ లో రోహిత్ ఆడలేదు. మొదటి మ్యాచ్ లో ధృవ్ జురెల్, పడిక్కల్ ఆడాడు. రెండో టెస్ట్ కు వచ్చేసారికి రోహిత్, శుభ్ మన్ గిల్, రవిచంద్రన్ అశ్విన్ జట్టులోకి వచ్చారు. రెండో టెస్ట్ నుంచి వాషింగ్టన్ సుందర్, ధృవ్ జురెల్, పడిక్కల్ తప్పించారు. మూడో టెస్ట్ కు వచ్చేసారికి అశ్విన్ స్థానంలో రవీంద్ర జడేజాను తీసుకున్నారు. హర్షిత్ రాణా స్థానంలో ఆకాశ్ దీప్ ను తీసుకున్నారు. నాలుగో టెస్ట్ కు వచ్చేసారికి గిల్ తప్పించి అతన స్థానంలో వాషింగ్టన్ సుందరు తీసుకున్నారు. అయితే రెండు మూడు టెస్ట్ ల్లో బ్యాట్స్ మెన్లు మార్చలేదు. కానీ నాలుగో టెస్ట్ లో శుభ్ మాన్ గిల్ తప్పించారు. అయినప్పటికీ భారత్ ఓడిపోయింది. దీంతో ఐదో టెస్ట్ జట్టు కూర్పులో కీలక మార్పు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆకాశ్ దీప్ గాయం కారణంగా చివరి టెస్ట్ కు దూరమయ్యాడు. అతడి స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది స్పష్టత లేదు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ ప్రస్తుతం %శ×%లో రిషబ్ పంత్ స్థానం గురించి చర్చిస్తున్నట్లు ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేర్కొంది. మెల్ బోర్న్ లో రిషబ్ పంత్ ఆటతీరును మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తప్పుబట్టిన తీరు తెలిసిందే. దీంతో రిషబ్ పంత్ స్థానంలో ధృవ్ జురెల్ తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పంత్ ఈ సిరీస్ లో ఏడు ఇన్నింగ్స్‌లలో కేవలం 154 పరుగులు చేశాడు. దీంతో అతన్ని తప్పించాలని డిమాండ్ వచ్చింది. అయితే పెర్త్ టెస్ట్ లో ఆడిన ధృవ్ జురెల్ ఆకట్టుకోలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్ ల్లో 11, 1 పరుగులు చేశాడు. అంతే కాకుండా వాషింగ్టన్ సుందర్, జడేజా ల్లో ఒకరిని మాత్రమే తుది జట్టుకు తీసుకునే అవకాశం ఉంది. ఆకాశ్ దీప్ స్థానంలో రాణాను తీసుకునే అవకాశం ఉంది. లేకుంటే ప్రసిద్ధ్ కృష్ణను కూడా తీసుకునే అవకాశం ఉంది. అతనికి ఈ సిరీస్ లో ఆడే అవకాశం లభించలేదు. పిచ్ పరిశీలించిన తర్వాతే తుది జట్టును ప్రకటిస్తామని కోచ్ గంభీర్ స్పష్టం చేశాడు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక

# మార్కో.. తెలుగులో ఊహించని ఓపెనింగ్స్




ఉన్ని ముకుందన్ హీరో మలయాళంలో ప్రేక్షకుల ముందుకొచ్చిన మోస్ట్ వైలెంట్ మూవీ 'మార్కో' సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. మలయాళంలో భారీ కలెక్షన్స్ దిశగా దూసుకుపోతోంది. ఇక హిందీలో కూడా ఈ సినిమా కలెక్షన్స్ రోజు రోజుకి పెరిగిపోతున్నాయి. తాజాగా తెలుగులో కూడా ఈ చిత్రం రిలీజ్ అయ్యింది. హిందీలో వచ్చిన "యానిమల్', 'కిల్' తర్వాత అంతకు మించి హైవోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ తో 'మార్కో' ప్రేక్షకుల ముందుకొచ్చింది. మలయాళంలో సినిమాకి హిట్ టాక్ రావడంతో తెలుగులో కూడా సినిమాపై హైప్ క్రియేట్ అయ్యింది. ఈ నేపథ్యంలో సినిమాకి మొదటి రోజు ఏకంగా 1.75 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ వచ్చినట్లు మేకర్స్ ప్రకటించారు. తెలుగులో హైయెస్ట్ ఓపెనింగ్ కలెక్షన్స్ అందుకున్న మొట్టమొదటి మలయాళీ మూవీగా 'మార్కో' రికార్డ్ సృష్టించింది.

తెలుగులో 'పుష్ప 2' హవా ఆల్ మోస్ట్ క్లోజ్ అయిపోయింది. ప్రస్తుతం థియేటర్స్ లో చెప్పుకోదగ్గ సినిమాలేవీ లేవు. దీంతో 'మార్కో' సినిమాకి ఆదరణ పెరగడం గ్యారెంటీ అనే టాక్ వినిపిస్తోంది. కచ్చితంగా తెలుగులో ఈ చిత్రం భారీ కలెక్షన్స్ అందుకోవడం గ్యారెంటీ అనుకుంటున్నారు. జనవరి 10న 'గేమ్ చేంజర్' మూవీ రిలీజ్ కాబోతోంది. అంటే మరో 8 రోజుల పాటు థియేటర్స్ లో ఈ సినిమాకి సాలిడ్ రెస్పాన్స్ రావొచ్చని అనుకుంటున్నారు. ముఖ్యంగా హైవోల్టేజ్ యాక్షన్ చిత్రాలు ఇష్టపడేవారికి 'మార్కో' బాగా నచ్చుతుందనే మాట వినిపిస్తోంది. సినిమాకి మొదటి రోజు తెలుగు రాష్ట్రాలలో 858 షోలు పడ్డాయి. 28.84% థియేటర్స్ ఆక్యుపెన్సీ నమోదు అయ్యింది. మౌత్ టాక్ పబ్లిక్ లోకి బలంగా వెళ్లడంతో థియేటర్స్ ఆక్యుపెన్సీ పెరుగుతుందని ట్రేడ్ పండితులు అంటున్నారు. 'పుష్ప 2' తర్వాత ఇప్పుడు దేశవ్యాప్తంగా 'మార్కో' పేరు వినిపిస్తోంది. మరి ఈ సినిమా ఎలాంటి కలెక్షన్స్ ని అందుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఉన్ని ముకుందన్ తెలుగులో 'జనతా గ్యారేజ్', 'భాగమతి', 'యశోదా' సినిమాలో నటించాడు. ఈ సినిమాలు అతనికి తెలుగునాట మంచి ఇమేజ్ తీసుకొచ్చాయి. అలాగే 'మాలికాపురం' అనే డబ్బింగ్ సినిమాతో ఉన్ని ముకుందన్ సక్సెస్ అందుకున్నాడు. హనీఫ్ అదేని దర్శకత్వంలో 'మార్కో' మూవీ తెరకెక్కింది. ఈ సినిమాతో దేశ వ్యాప్తంగా ఉన్ని ముకుందన్ పేరు వినిపిస్తోంది. దుల్కర్ సల్మాన్ తర్వాత దేశ వ్యాప్తంగా పాపులారిటీ సొంతం చేసుకునే మల్లు స్టార్ గా ఉన్ని ముకుందన్ మారడం గ్యారెంటీ అని అనుకుంటున్నారు.

# నేషనల్ క్రష్ మాజీని గుర్తు చేసు కుంటుందా!

సెలబ్రిటీలంతా గ్రాండ్ గా న్యూ ఇయర్ కి వెల్కమ్ చెప్పేసారు. కొత్త ఏడాదిలో జీవితం మరింత సంతోషంగా సాగి పోవాలని కోరుకుంటున్నారు. గత జ్ఞాపకాలను పదిలం చేసుకుని కొత్త ఏడాది అందించే జ్ఞాపకాల కోసం ఎదురు చూస్తున్నారంతా. మరి అలాంటి మధుర జ్ఞాపకంగా నేషనల్ క్రష్ రష్మిక మందన్నాకి ఏదైనా ఉందా? అంటే ఉందం టోంది. డిసెంబర్ 30వ తేదీని జీవితంలో ఎప్పుడూ మర్చిపోలేను అంటోంది. ఆరోజు అమ్మడు నటించిన తొలి సినిమా రిలీజ్ అయిన డే కావడంతో జీవితాంతం అదో మధుర జ్ఞాపకంగా పేర్కొంది. అదే సినిమా ఆమె జీవితాన్ని కూడా మార్చేసింది. నేడు నేషనల్ క్రష్ గా నీరాజనాలు అందుకుంటుంది అంటే? ఆ సినిమా విజయంతోనే సాధ్యమైందీ జీవితం. అమ్మడి తొలి సినిమా కన్నడలో నటించిన 'కిరిక్ పార్టీ'. అందులో హీరోగా నటించింది రక్షిత్ శెట్టి. ఆమెని హీరోయిన్ చేసిందే రక్షిత్ శెట్టి. శాండిల్ వుడ్ లో ఆ సినిమా మంచి విజయం సాధించింది. %ూశ్రీంశీ =ముఁ% – సంక్రాంతికి వస్తున్నాం%ొ% ట్రెండింగ్ తో కిక్కిచ్చేలా..కిరిక్ పార్టీసమయంలోనే రక్షిత్ శెట్టితోనే అమ్మడు ప్రేమలోనూ పడింది. ఇద్దరు చాలా కాలం ప్రేమించుకున్నారు. నిశ్చితార్థం కూడా జరిగింది. కానీ టాలీవుడ్ బెద్యూ ఛలోతర్వాత సీన్ మారిపోయింది. నటిగా తెలుగులో బిజీ అవ్వడం...కొన్నాళ్లకు రక్షిత్ తో ప్రేమాయణం వికటించడం..అటుపై నిశ్చితార్థం క్యాన్సిల్ అవ్వడం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక చాలా విమర్శలు ఎదుర్కుంది. కెరీర్ కోసమే రక్షిత్ కి దూరమైంది? అన్న విమర్శ ప్రధానంగా హైలైట్ అయింది. చివరికి రక్షిత్ అభ్యర్ధన మేరకు విమర్శలకు ఫుల్ స్టాప్ పడింది. ఇదంతా రష్మిక వ్యక్తిగత జీవితంలో ఓ భాగం. ప్రస్తుతం రష్మిక కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. పుష్పతో పాన్ ఇండియాలో ఎంతో ఫేమస్ అయింది. బాలీవుడ్ లోనూ సినిమాలు చేస్తోంది. నటిగా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది.



# పవన్ కల్యాణ్ ఆర్థిక సాయం.. ఫిష్ వెంకట్ భావోద్వేగం..





టాలీవుడ్ నటుడు ఫిష్ వెంకట్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అండగా నిలిచారు. ఈ విషయాన్ని ఆయన తాజాగా ఓ వీడియో ద్వారా వెల్లడించారు.
అనారోగ్యం కారణంగా సినిమాలకు దూరం కావడంతో వెంకట్ ఆర్థికంగాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో చాలా మంది ప్రముఖ నటులు తెలుసు కనుక ఈ కష్టసమయంలో ఎవరినైనా సాయం కోరాలని కుటుంబ సభ్యులు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. దాంతో సాయం విషయమై తన భార్య సువర్ణ ఒత్తిడి మేరకు పవన్‌ను కలిసినట్లు వెంకట్ చెప్పారు. పవన్‌ను కలిసి, తన అనారోగ్య సమస్యను వివరించడంతో వెంటనే అన్ని విధాలా సహాయం చేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. అలాగే తన ఆర్థిక ఇబ్బందులను గమనించి తన బ్యాంకు ఖాతాలో వెంటనే రూ. 2 లక్షలు జమ చేయించారని వెంకట్ పేర్కొన్నారు.
తనను ఈ కష్టకాలంలో ఆదుకున్న పవన్ కల్యాణ్, ఆయన కుటుంబం ఎప్పుడూ ఆనందంగా ఉండాలని దేవుడ్ని కోరుకుంటున్నానని ఫిష్ వెంకట్ భావోద్వేగానికి గురయ్యారు. ఈ వీడియోను పవన్ అభిమానులు షేర్ చేయగా వైరల్ అవుతోంది.

# 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ విడుదల..




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దక్షిణాది స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ మూవీ ట్రైలర్‌ను తాజాగా ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి విడుదల చేశారు. అందరూ ఊహించినట్లుగా ట్రైలర్ అదిరిపోయింది. తండ్రీకొడుకులుగా రామ్ నందన్, అప్పన్న పాత్రల్లో రామ్ చరణ్ అదరగొట్టారు. డైలాగ్స్ థియేటర్లను మోతెక్కించడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక సీన్లకు తగ్గట్టుగా తమన్ బీజీఎం వెరె లెవెల్ అని చెప్పాలి. మొత్తానికి ఈ సంక్రాంతికి ఫుల్ మీల్స్ లాంటి సినిమాను ప్రేక్షకులకు శంకర్ అందించబోతున్నారని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. చరణ్‌కు జోడిగా బాలీవుడ్ నటి కియారా అద్వానీ నటించిన ఈ సినిమాను శ్రీవెంకటేశ్వర సినీ క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ ఈ మూవీకి కథను అందించగా.. సముద్రఖని, ఎస్‌జే సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర, అంజలి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు.

**అందరూ ఊహించినట్లుగానే అదరగొట్టిన చెర్రీ!**




స్టార్ డైరెక్టర్ సుకుమార్– తబితా దంపతుల కుమార్తె నటించిన సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో 'గాంధీతాత చెట్టు' చిత్రాన్ని పద్మావతి మల్లాది తెరకెక్కించిన సంగతి తెలిసిందే. పర్యావరణ పరిరక్షణ ఇతివృత్తంతో సందే శాత్మకంగా తెరకెక్కించిన చిత్రమిది. దీంతో అంతర్జాతీయ స్థాయి అవార్డులను అందుకుంది. ఉత్తమ బాలనటిగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు లభించింది. దుబాయ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ , ఇండియన్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్‌లో, సుకృతి బెస్ట్ డెబ్యూటెంట్ చైల్డ్ ఆర్టిస్ట్ విభాగంలో అవార్డులను గెలుచుకుంది. అలాగే 11వ నోయిడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రం అవార్డు, న్యూఢిల్లీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరీ ఉత్తమ చిత్రం , ఉత్తమ ప్రాంతీయ చిత్రం, జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరీ ఉత్తమ చిత్రం , 8వ ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కూడా అవార్డులు గెలుచుకుంది.. ఇంకా పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ఆహ్వానాలు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా రిలీజ్ తేదీ ఫిక్సైంది. జనవరి 24న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శాంతి సందేశం, అహింసా మార్గం, పచ్చని చెట్టు యొక్క గొప్పతనాన్ని, మహిళా సాధికారత, పర్యావరణం సమతుల్యత వంటి అంశాల్ని కథలో హైలైట్ చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి మంచి చిత్రాలు ప్రజల హృదయాల్లో నిలిచిపోవాలన్నారు. వాటిని ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తమ ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదించాలని కోరారు. ఈ చిత్రంలో ఆనంద్ చక్రపాణి, రఘు రామ్, భాను ప్రకాశ్, నేహాల్ ఆనంద్ కుంకుమ, రాగ్ మయూర్ కీలక పాత్రలు పోషించారు. సుకుమార్ రైటింగ్స్–మైత్రీ మూవీమేకర్స్– గోపీ టాకీస్ సంయుక్తంగా నిర్మించాయి.

# సుకుమార్ డాటర్ సినిమా రిలీజ్ ఫిక్సైంది